
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
కృష్ణా జిల్లా వార్తలు
శనివారం 17 మే 2025



కనరో.. కీర్తి పతాక

విజయవాడలో ఘనంగా తిరంగా ర్యాలీ

- ఆపరేషన్ సిందూర్ విజయాన్ని కీర్తిస్తూ యాత్ర
- పాల్గొన్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి
- ప్రత్యేక ఆకర్షణగా సాంస్కృతిక ప్రదర్శనలు


ర్యాలీలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, పురందేశ్వరి

బందరురోడ్డులో తిరంగా ర్యాలీ


మచిలీపట్నంలో...





దేశభక్తిని చాటిన సాంస్కృతిక ప్రదర్శనలు

భారత కీర్తి పతాకం రెపరెపలాడింది. వందేమాతర జేజేలతో విజయవాడ వెల్లివిరిసింది. జైహింద్.. జైజవాన్.. నినాదాలతో ఎల్లడెలా దేశభక్తి మార్మోగింది. 'ఆపరేషన్ సిందూర్' విజయాన్ని కీర్తిస్తూ నగరంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన భారత శౌర్య తిరంగా ర్యాలీకి విశేష స్పందన లభించింది. కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా పౌరులు ఈ ర్యాలీలో పాల్గొని మనదేశ ఔన్నత్యాన్ని చాటారు. బందరురోడ్డులో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి ప్రారంభమైన యాత్ర బెంజిసర్కిల్ వరకూ సాగింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి జాతీయ జెండాలతో యాత్ర ముందు సాగగా, ప్రత్యేక సాంస్కృతిక ప్రదర్శనలు, దేశభక్తి గేయాలాపనలు మన సైనికుల వీరపరాక్రమాలను తెలియజేశాయి.

- కథనం 6లో
6లో

పృథ్వీశ్వరుడి భూములు స్వాహా..!

నరకాసుర వధ అనంతరం శ్రీకృష్ణుడు ప్రతిష్ఠ చేసినట్టుగా పురాణాలు చెబుతున్న నడకుదురు శ్రీపృథ్వీశ్వరస్వామి భూములు అన్యాక్రాంతానికి గురయ్యాయి. పెదపారుపూడి మండలం యలమర్రు ప్రాంతంలో స్వామివారికి చెందిన రూ.30 కోట్లకుపైగా విలువచేసే 50 ఎకరాలను ప్రైవేట్ వ్యక్తులు తమ పేరిట మార్చేసుకున్నారు. కొందరు రైతులైతే పాస్ పుస్తకాలు కూడా తెచ్చుకున్నారు. దేవదాయ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో దశాబ్దంన్నర కిందటి నుంచి యథేచ్ఛగా సాగుతున్న ఈ భూ దోపిడీ వైసీపీ హయాంలో జరిగిన రీసర్వేతో మరింత ఎక్కువైంది. ఇప్పటికి కదిలిన యంత్రాంగం చర్యలకు ఉపక్రమించింది.

నడకుదురు ఆలయ నిర్వహణకు యలమర్రులో 61 ఎకరాలు

వాటిలో 50.06 ఎకరాలు ప్రైవేట్ వ్యక్తుల అన్యాక్రాంతం


నడకుదురులోని పృథ్వీశ్వరస్వామి

- అడంగల్‌లో పేర్ల మార్పు.. పాస్ పుస్తకాలూ జారీ
- వైసీపీ హయాంలో రీసర్వే పేరిట మరిన్ని అక్రమాలు
- 'రెవెన్యూ'కు దేవదాయ శాఖ అధికారుల ఫిర్యాదు
- చర్యలకు ఉపక్రమించిన అధికారులు, భూముల పరిశీలన

భూములను పరిశీలిస్తున్న అధికారులు


అవనిగడ్డ/చల్లపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి మండలం నడకుదురు గ్రామంలోని శ్రీపృథ్వీశ్వరస్వామి ఆలయ నిర్వహణ నిమిత్తం 1948కు పూర్వమే భక్తులు పెదపారుపూడి మండలం యలమర్రు ప్రాంతంలో 61.48 ఎకరాలు రాసిచ్చారు. అందులో దూపదీప నైవేద్యాలకు 11.42 ఎకరాలు కేటాయించగా, మిగిలిన 50.06 ఎకరాలను దేవదాయ శాఖ పట్టించుకోలేదు. దేవదాయ భూములు కంప్యూటరైజ్ కావటానికి పూర్వమే ఈ భూములను సాగు చేసుకుంటూ వచ్చిన కొందరు ప్రైవేట్ వ్యక్తులు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై తమ పేర్లతో అడంగల్ మార్చుకున్నారు. వైసీపీ హయాంలో జరిగిన రీ సర్వే సమయంలో ఈ పేర్ల మార్పులు భారీగానే జరిగాయనే ఆరోపణలు వస్తున్నాయి. అంతేకాదు.. రైతుల పేరుతో పాస్ పుస్తకాలు కూడా సృష్టించారు. ఇప్పటికే కొందరు వాటిని విక్రయించేశారు కూడా. దాదాపు దశాబ్దంన్నరకుపైగా ఈ ప్రక్రియ కొనసాగుతూ రాగా, ప్రస్తుతం రూ.30 కోట్లకు పైగా విలువైన 50.06 ఎకరాలు ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలోకి వెళ్లిపోయాయి.

స్వామి భూములకు ఎసరు

పెదపారుపూడి మండలం యలమర్రు గ్రామంలోని రిజిస్టర్ సర్వే నెంబర్ 3-2, 4-3, 4-4, 6-2, 6-3, 6-4, 7-1, 7-2, 10-1, 10-2, 11, 12, 13-1, 13-2, 13-3, 13-12, 14, 18 భూమిలోని 3-2లోని 11.42 ఎకరాలు మినహా మిగిలిన భూమికి సంబంధించి అడంగల్‌లో పేర్లు మార్చేసి ప్రైవేట్ వ్యక్తుల పేరుతో పాస్ పుస్తకాలు జారీ చేశారు. ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన దేవదాయ శాఖ అధికారులు 2022, ఫిబ్రవరి 10న రెవెన్యూ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అయితే, నాటి ప్రభుత్వ పెద్దలు ఈ విషయాన్ని పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక.. గత డిసెంబరు 18న జరిగిన రెవెన్యూ సదస్సులో మారోసారి ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు దేవస్థానం భూములను సర్వే చేసి తమకు అప్పగించాలని అర్జీ దాఖలు చేశారు. దీనిపై స్పందించిన రెవెన్యూ సిబ్బంది ఫిబ్రవరి 25న సదరు భూములకు సంబంధించి అడంగల్‌లో ప్రైవేట్ వ్యక్తుల పేర్లు నమోదయ్యాయని, దీనిపై రీ సర్వే నిర్వహించి అడంగల్‌లో స్వామివారి పేర్లను మారుస్తామని ఎండాస్‌మెంట్ ఇచ్చారు.

వైసీపీ హయాంలోనే పేర్ల మార్పు

పృథ్వీశ్వరస్వామికి చెందిన 50.06 ఎకరాల దేవస్థానం భూములకు సంబంధించి వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన రీ సర్వేలో ఎక్కువ మంది తమకు అనుకూలంగా పేర్లు మార్చుకున్నట్లు రెవెన్యూ వర్గాల ద్వారా తెలిసింది. సాగుబడిలో ఉన్న రైతుల పేర్లతో అప్పటికే శిస్తులు ఉండటాన్ని సాకుగా చూపించి రెవెన్యూ

మిగతా 6లో..



జలమయమైన గుడివాడ బస్టాండ్ (ఇన్‌సెట్‌లో) వల్లూరుపాలెంలో తడిసిపోయిన మొక్కజొన్న

జోరువాన

గురువారం తెల్లవారుజామున 3 గంటల పాటు కుండపోత

- జిల్లావ్యాప్తంగా జనజీవనం అస్తవ్యస్తం
- గుడివాడ బస్టాండ్‌లోకి చేరిన నీరు
- తడిచిపోయిన వరి, మొక్కజొన్న
- మరో రెండు రోజులు వర్షసూచన

మచిలీపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా గురువారం తెల్లవారుజాము నుంచి శుక్రవారం ఉదయం వరకూ భారీవర్షం కురిసింది. దాదాపు 3 గంటల పాటు ఎడతెరిపి లేకుండా పడిన వర్షానికి జనజీవనం అల్లాడిపోయింది. ఈ వర్షానికి తోడు ఉరుములు, మెరుపులు తోడవడంతో చాలా ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. గుడివాడ బస్టాండ్‌తో పాటు ధనియాలపేటలోని ఇళ్లలోకి నీరు చేరింది. పట్టణంలోని పలుచోట్ల డ్రెయినేజీలు పొంగి రహదారులపైకి నీరు చేరింది. పెద ఓగిరాలలో పొలాల్లో ఆరబెట్టిన పసుపు, మొక్కజొన్న తడిసి ముద్దయ్యాయి. చిన ఓగిరాలలో పొలాల్లో ఉన్న ధాన్యం రాశులపై కప్పి ఉంచిన పరదాలు బలమైన గాలుల ప్రభావానికి

మిగతా 6లో..

జిల్లా జైలు సూపరింటెండెంట్‌పై వేటు

హంసపాల్‌ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు

- వైసీపీ వీరవిధేయుడిగా పేరు
- జైల్లోని సమాచారం తాడేపల్లి ప్యాలెస్‌కు..
- ఆరోపణలు పెచ్చుమీరడంతో ప్రభుత్వ చర్యలు
- ఆ స్థానంలో మహ్మద్ ఇర్ఫాన్ నియామకం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ జిల్లాజైలు సూపరింటెండెంట్ హంసపాల్‌పై వేటు పడింది. ఆయనను ఇక్కడి నుంచి బదిలీ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని కేంద్ర కారాగారంలో పోస్టింగ్ ఇస్తూ, నెల్లూరులోని శిక్షణా కేంద్రానికి అటాచ్ చేశారు. ఆయన స్థానంలో ప్రకాశం జిల్లాలో సబ్‌జైళ్ల అధికారిగా ఉన్న మహ్మద్ ఇర్ఫాన్‌కు పదోన్నతి

మిగతా 6లో..

బీడీసీపై గండ్లు పడిన చోట రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు


బుడమేరు ప్రక్షాళన ప్రారంభం

భారీ గండ్ల ప్రాంతంలో బీడీసీకి రక్షణ గోడ

- పనులు ప్రారంభించిన మంత్రి నిమ్మల
- జూన్ 10 నాటికి పూర్తిచేసే అవకాశం
- వెలగలేరు నుంచి సమాంతరంగా మరో కాల్వ

ఇబ్రహీంపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి) : బుడమేరు వరద నుంచి శాశ్వత పరిష్కారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం తొలి అడుగు వేసింది. రూ.28 కోట్లు కేటాయించి గండ్లు పడిన చోట అర కిలోమీటర్ మేర రిటైనింగ్ వాల్ నిర్మాణ పనుల్ని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఇటీవల ప్రారంభించారు. ప్రస్తుతం పనులు చురుగ్గా

మిగతా 6లో..

ఇళ్ల పట్టాల చెరలో..

2019లో పేదలను మోసం చేసిన వల్లభనేని వంశీ

ఇప్పటికే లెక్కకుమించిన కేసుల్లో చిక్కుకుని జైలు జీవితం అనుభవిస్తున్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ మెడకు నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ కేసు కూడా చుట్టుకుంది. ఓట్లే ఎరగా, పేదలను మభ్యపెట్టి నాడు ఎమ్మెల్యే స్థానంలో ఉండి వంశీ చేసిన ఈ నకిలీ పట్టాల కేసులో ఈనెల 29 వరకు నూజివీడు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి రిమాండ్ విధించడంతో నియోజకవర్గవ్యాప్తంగా చర్చ మొదలైంది.

- నియోజకవర్గవ్యాప్తంగా 1,200 నకిలీ పట్టాలు అందజేత
- ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి ఇష్టానుసారంగా..
- ఎన్నికలు పూర్తయ్యాక నకిలీ వ్యవహారం వెలుగులోకి..
- పట్టాలు వెనక్కి తీసేసుకున్న వంశీ అనుచరులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన తహసీల్దార్ నరసింహారావు
- వైసీపీ హయాంలో స్తబ్దుగా ఉన్న కేసు
- తాజా పరిణామాల్లో ఈనెల 29 వరకు రిమాండ్



హనుమాన్ జంక్షన్ రూరల్, ఆంధ్రజ్యోతి : 2019 ఎన్నికల సమయంలో నాటి గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ఆధ్వర్యంలో బాపులపాడు మండలంలో పెరికీడు, కోడూరుపాడు, కొయ్యూరు, బాపులపాడు గ్రామాల్లో సుమారు 400కు పైగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. మార్చిలో ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసిన తరువాత ఏప్రిల్‌లో పేదలను మభ్యపెట్టేలా ఈ పట్టాలు అందజేశారు. ఆ తర్వాత ఆ పట్టాలన్నీ నకిలీవనే విషయం బయటపడింది. అయితే, ఆ ఇళ్ల పట్టాలు చట్టబద్ధంగా మంజూరు కాలేదని, అవన్నీ నకిలీ పట్టాలేనని నాటి తహసీల్దార్ కలగర గోపాలకృష్ణ పేరును, తహసీల్దార్ కార్యాలయ సీల్‌ను దుర్వినియోగం చేస్తూ కల్పించిన పట్టాలుగా రెవెన్యూ శాఖ దర్యాప్తులో తేలింది. ఆ తర్వాత 2019, అక్టోబరు 16న తహసీల్దార్ నరసింహారావు హనుమాన్ జంక్షన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో అసలు తమకిచ్చిన పట్టాలు నిజమైనవా, కాదా అనే అయోమయంలో లబ్ధిదారులు తలలు పట్టుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కొందరికి జగనన్న కాలనీల్లో పట్టాలు కేటాయించామని చెప్పడంతో ఏదో రకంగా ఇంటి స్థలం వస్తుందిలే అని ఆనందపడ్డామని పెరికీడు, కొయ్యూరుకు చెందిన మహిళా లబ్ధిదారులు తెలిపారు. ఇప్పటికీ పెరికీడు, కొయ్యూరు, కోడూరుపాడు గ్రామాల్లో

మిగతా 6లో..

మణప్పురంలో బంగారం గోల్‌మాల్

- బుట్టాయిపేటలోని కార్యాలయానికి బాధితుల తాళం
- 123 గ్రాముల తాకట్టు బంగారం మాయం

6లో

అవనిగడ్డలో జిల్లా కోర్టు ప్రారంభం

6లో

డ్రోన్లు, సీసీ కెమెరాలతో నేర నియంత్రణ

- నేర సమీక్షలో ఎస్పీ

పకడ్బందీగా పది సప్లిమెంటరీ

- ఏర్పాట్లు చేయాలని డీఆర్వో ఆదేశాలు

8లో





ఉప్పొంగిన దేశభక్తి..





మీ వెంట మేమున్నాం



త్రివిధ దళాలకు.. సెల్యూట్

మీ శౌర్యానికి మా ప్రణామాలు

- ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా 'భారత శౌర్య తిరంగా యాత్ర'
- దేశభక్తితో పులకించిన మహాత్మాగాంధీ రోడ్డు
- భారత్ మాతాకీ జై.. వందేమాతరం అంటూ నినాదాలు
- ఉగ్రదాడికి వ్యతిరేకంగా వేలాదిగా కదిలి వచ్చిన జనం
- ముందుండి నడిపించిన సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్
- యువత, మాజీసైనికులు, మహిళలతో ర్యాలీ విజయవంతం
- 500 మీటర్ల త్రివర్ణ పతాకంతో విద్యార్థుల ర్యాలీ
- ముస్లింల సంఘీభావం.. ర్యాలీలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

విజయవాడ, మే 16 (ఆంధ్రజ్యోతి): మీ శౌర్యత్వానికి మా ప్రణామం.. ప్రజల ప్రాణాలను సంరక్షిస్తున్న ధీర సైనికులారా సలామ్.. వీర మరణం పొందిన సైనికులారా మీకు మా మనస్సాంజలి. భారత్ జోలికి వస్తే శత్రువుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన మిమ్మల్ని చూసి ఎంతగానో గర్విస్తున్నాం.. దేశ రక్షణ కోసం సరిహద్దున పోరాడుతున్న వీర జవానులారా.. మేమంతా మీ వెంటే ఉన్నాం.. భారత్ మాతాకీ జై.. వందేమాతరం.. అంటూ 'భారత శౌర్య తిరంగా యాత్ర'లో నగర ప్రజలు రణనినాదం చేశారు. కులమతాలకు అతీతంగా దేశభక్తిని చాటారు. చిన్న పిల్లల నుంచి పెద్దలు, వృద్ధుల వరకు సంఘటితంగా దేశభక్తిని చాటారు. శుక్రవారం మహాత్మాగాంధీ (ఎంజీ) రోడ్డు త్రివర్ణ శోభితమై శతృదేశాలకు సింహస్వప్నంగా గర్జించింది. ర్యాలీని ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి తదితరులు ముందుండి నడిపించారు. ప్రజల్లో దేశభక్తి స్ఫూర్తిని రగిలించారు.

పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో ఎన్డీయే భాగస్వామ్యులు నిర్వహించిన తిరంగా ర్యాలీలో యువత, మాజీ సైనికులు, విద్యార్థులు, ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని మద్దతు తెలిపారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి బెంజిసర్కిల్ వరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి జాతీయ పతాకాలు చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. రెండు కిలోమీటర్ల పొడవునా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కాలినడకతో ర్యాలీని ఉత్సాహంగా ముందుండి నడిపించారు. ప్రజల్లో జోష్ నింపారు.

ఎన్డీయే ఇచ్చిన పిలుపు మేరకు ర్యాలీకి నగరంలో వేలాది మంది స్వచ్ఛందగా పాల్గొని మద్దతు తెలిపారు. రోడ్డు మధ్యలో డివైడర్‌పోల్స్‌కు ఏర్పాటుచేసిన లైటింగ్ త్రివర్ణపతాక రంగులను విరజిమ్మింది. ర్యాలీలో యువత నుంచి అన్ని వయస్కుల వారి చేతిలో త్రివర్ణ పతాకం, భారతమాత నినాదాలతో నగరం దేశభక్తిని చాటుకుంది. స్టేడియం వద్ద కళాకారులు నృత్యాలతో అలరించారు. ర్యాలీలో ఆపరేషన్ సిందూర్‌లో మరణించిన మురళీనాయక్ ఫోటోలను ప్రదర్శిస్తూ త్రివిధ దళాలను కీర్తిస్తూ ముందుకు సాగారు. ముస్లింలు సైతం జాతీయజెండాలతో ర్యాలీలో పాల్గొని పాకిస్తాన్, ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు రోప్‌ను ఏర్పాటు చేయడంతో ర్యాలీ ఎటువంటి ఆటంకం లేకుండా ముందుకు సాగింది.

సరైన సమయంలో పాకిస్తాన్ ఆటకట్టించిన ప్రధాని మోదీ

- ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)

ప్రధాని మోదీ సరైన సమయంలో సరైన నిర్ణయంతో పాకిస్తాన్ ఉగ్రవాదుల ఆటకట్టించారు. భారతీయ మహిళలను పిరికివాళ్లుగా భావించి చులకనగా చూసిన పాక్ ఉగ్రవాదులకు మోదీ సరైన గుణపాఠం చెప్పారు. దేశరక్షణ కోసం ప్రాణాలను కోల్పోయిన మురళీనాయక్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటారు. మరోసారి పాకిస్తాన్ తోకజాడిస్తే మరింత గట్టిగా బుద్ధి చెప్పడానికి భారత సైన్యం సిద్ధంగా ఉంది.

పాకిస్తాన్‌కు తగిన గుణపాఠం

- జనసేన మహిళా నేత తిరుపతి అనూష

ఉగ్రవాదులకు, పాకిస్తాన్‌కు ఆపరేషన్ సిందూర్‌తో సరైన గుణపాఠం చెప్పిన త్రివిధ దళాలకు సంఘాభావంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొనడం ఆనందంగా ఉంది. భారత మహిళల బొట్టును చెరిపేసిన ఉగ్రవాదుల నుదిటిన మన సైన్యం తూటా దించి చంపడంతో పాకిస్తాన్‌కు బుద్ధిచెప్పారు. పాకిస్తాన్, ఉగ్రవాదులకు మోదీ భారతదేశ సత్తా ఏంటో చాటిచెప్పారు.

శతృవుల గుండెల్లో సింహనాదం

మహాత్మాగాంధీ (ఎంజీ) రోడ్డు మువ్వన్నెల పతాకాలను చేబూనిన దేశభక్తుల పదఘట్టనలతో మారు మోగగా.. మరోవైపు దేశభక్తులను ఉద్దేశించిన నాయకుల ప్రసంగాలతో శతృమూకలకు సింహనాదం వినిపించారు. ఈ సందర్భంగా కృష్ణాజిల్లాకు చెందిన త్రివర్ణ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య గురించి ప్రత్యేకంగా ప్రస్తావించి కొనియాడారు. అంతకుముందు మున్సిపల్ స్టేడియం వద్ద కళాకారులు నృత్యాలతో ర్యాలీకి వచ్చిన వారిని అలరించారు. విద్యార్థులు 500 మీటర్ల పొడువున్న త్రివర్ణ పతాకంతో ర్యాలీలో ముందుకు సాగారు. వీరితో పాటు చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు సత్యకుమార్, నాదెండ్ల మనోహర్, కొలుసు పార్థసారథి, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు, బోడె ప్రసాద్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, బుద్దా వెంకన్న తదితరులు ర్యాలీని అనుసరించారు. ప్రజలు స్వచ్ఛందంగా త్రివర్ణ పతాకాలతో ర్యాలీలో పాల్గొన్నారు. ఎటువంటి తొక్కిసలాట జరగకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావంగా ర్యాలీలో జిల్లాకు చెందిన 500మంది ఎన్ఎస్ఎస్, ఎన్సీపీ వలంటీర్లు పాల్గొన్నారు. కలెక్టర్ పిలుపు మేరకు ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల సహా పలు కాలేజీల నుంచి ఎన్ఎస్ఎస్, ఎన్సీపీ వలంటీర్లు పాల్గొన్నారు. ర్యాలీలో వలంటీర్లు ఉత్సాహంగా పాల్గొని ప్రజల్లో ఉత్సాహం నింపారు.





కళా విన్యాసాలు




బందరులో తిరంగా ర్యాలీలో పాల్గొన్న కూటమి నేతలు

మచిలీపట్నంలో తిరంగా ర్యాలీ

- పాల్గొన్న కూటమి నేతలు, కేయూ ఉపకులపతి రాంజీ

మచిలీపట్నం టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : పాకిస్తాన్ ఉగ్రవాదులను తుదముట్టించిన ఆపరేషన్ సిందూర్ విజయవంతంతో శుక్రవారం మచిలీపట్నంలో కూటమి నాయకులు కోనేరుసెంటర్ నుంచి బస్టాండ్ వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. భారతసైన్యం ధైర్యసాహసాలు, త్యాగాలను నేతలు ప్రశంసించారు. కోనేరుసెంటర్‌లో ప్రారంభమైన ర్యాలీలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ రాజబాబు, డీసీఎంఎస్ ఛైర్మన్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, కొనకళ్ల బుల్లయ్య, మోటమర్రి బాబాప్రసాద్, హసీంబేగ్, పీవీ ఫణికుమార్, పంతం గజేంద్రరావు, సూరిశెట్టి హరికృష్ణ, ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, గడ్డంరాజు తదితరులు పాల్గొన్నారు. తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు హసీంబేగ్ రిక్షా తొక్కి పాల్గొన్నారు.

అవనిగడ్డలో జిల్లా కోర్టు ప్రారంభం



కోర్టు భవనాన్ని ప్రారంభిస్తున్న జిల్లా న్యాయాధికారి గోపి

అవనిగడ్డ, మే 16 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డలో 6వ అదనపు జిల్లా కోర్టు ఏర్పాటుతో కక్షిదారులు 100కిలోమీటర్ల మేర వెళ్లే ఇబ్బందులు ఎట్టకేలకు పరిష్కారమయ్యాయి. జిల్లా సెషన్స్ న్యాయాధికారి జి.గోపి, 6వ అదనపు జిల్లా న్యాయాధికారి పాండురంగారెడ్డితో కలిసి శుక్రవారం అదనపు జిల్లా కోర్టును లాంఛనంగా ప్రారంభించారు. అవనిగడ్డ నుంచి మచిలీపట్నంలో 6వ అదనపు జిల్లా జడ్జి కోర్టుకు వచ్చేందుకు కక్షిదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారని, అవనిగడ్డలోనే ఈ కోర్టును ఏర్పాటు చేయటంతో ఇక్కడి ప్రజల ఇబ్బందులు ఎట్టకేలకు పరిష్కారమయ్యాయని జిల్లా సెషన్స్ జడ్జి గోపి తెలిపారు. 6వ అదనపు జిల్లా న్యాయాధికారిగా బాధ్యతలు స్వీకరించిన పాండురంగారెడ్డి మాట్లాడుతూ, కక్షిదారుల ప్రయోజనాలే లక్ష్యంగా న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.అరుణ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి స్వర్ణలత, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సనకా రఘురామ ప్రసాద్, రాయపూడి గోపాలపారావు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

డ్రోన్లు, సీసీ కెమెరాలతో నేర నియంత్రణ : ఎస్పీ



మచిలీపట్నం టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : డ్రోన్లు, సీసీ టీవీ కెమెరాలు, ఇతర సాంకేతిక పరిజ్ఞానంతో పరిశోధనలు వేగవంతం చేస్తూ నేరాలను నియంత్రించాలని ఎస్పీ గంగాధరరావు అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా స్థాయిలో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలో పోలీసు అధికారుల పనితీరు సంతృప్తికరంగా ఉందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే ఆకతాయిలను డ్రోన్ కెమెరాలతో పసిగట్టాలన్నారు. హత్యలు, దొంగతనాలు కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ అడ్మిన్ వీవీ నాయుడు, ఏఎస్పీ ఏఆర్ సత్యనారాయణ, డీఎస్పీలు పాల్గొన్నారు.

జైలు సూపరింటెండెంట్‌పై వేటు

(5వ పేజీ తరువాయి)

కల్పించి నియమించారు.

వైసీపీకి వీర విధేయుడు

వైసీపీ అధినేత జగన్‌కు హంసపాల్ వీరభక్తుడిగా వ్యవహరించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆయన్ను పనిగట్టుకుని ఇక్కడికి తీసుకొచ్చారు. ప్రస్తుతం విజయవాడ జిల్లాజైలు వైసీపీ వీరవిధేయులతో నిండిపోయింది. ఇక్కడ గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్, ఐపీఎస్ అధికారి పి.సీతారామాంజనేయులు, మద్యం కుంభకోణంలో కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పీఏ దిలీప్, భారతీ సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప బాలాజీ రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. వివిధ కేసుల్లో వైసీపీ విధేయులు ఒక్కొక్కరుగా జైలుకు వెళ్లడం మొదలైన తర్వాత హంసపాల్‌పై ఆరోపణలు పెరిగాయి. ఇక్కడి నుంచి ప్రతి చిన్న సమాచారం తాడేపల్లిలోని వైసీపీ కార్యాలయానికి చేరుతున్నట్టు ప్రభుత్వం పసిగట్టింది. తానెంతో నిజాయితీపరుడినని చెప్పుకొనే హంసపాల్ జైల్లో ప్రతి పనినీ అత్యంత రహస్యంగా కానిస్తుంటారనే ఆరోపణలు ఉన్నాయి.

అప్పుడు ఒకలా.. ఇప్పుడు ఒకలా..

వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు హంసపాల్ విజయవాడ జిల్లా జైలుకు సూపరింటెండెంట్‌గా వ్యవహరించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పాల్ కుర్చీ కదులుతుందని అంతా భావించారు. ఇది జరగకపోగా, ఆయన పదిలమైపోయారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు కొంత మంది టీడీపీ నాయకులను కేసుల్లో ఇరికించి జిల్లాజైలులో పెట్టారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కింజరపు అచ్చెన్నాయుడును ఈఎస్ఐ నిధుల దుర్వినియోగం కేసులో అరెస్టు చేసి ఈ జైల్లో పెట్టారు. ఆ తర్వాత మరి కొంతమంది నేతలను ఈ జైలుకు పంపారు. జైల్లో వారి పరిస్థితిని ఎప్పటికప్పుడు తాడేపల్లి కార్యాలయానికి హంసపాలే తెలియజేసేవారు. నాడు వారు జైల్లో కొన్ని సదుపాయాలు కల్పించమని కోరినా నిరభ్యంతరంగా తోసిపుచ్చేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. సూపరింటెండెంట్‌గా హంసపాల్ ఉన్నా నిందితులకు రాజభోగాలు సాగుతున్నాయి. ఇక్కడున్న వైసీపీ విధేయ నిందితులకు చేరాల్సిన సమాచారం.. అన్ని మార్గాల్లోనూ అందుతోంది. రాష్ట్రంలోని ప్రతి కేంద్ర కారాగారం, జిల్లా కారాగారంలో సూపరింటెండెంట్ చాంబర్ వరకు మీడియాకు అనుమతి ఉంటుంది. ఈ విషయంలో మాత్రం హంసపాల్ పూర్తిగా భిన్నం. మీడియా ప్రతినిధులే కాదు, స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్ విభాగాల అధికారులు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయరు. ఆయనను కలవడానికి సెంట్రీ సిబ్బంది నుంచి సమాచారం పంపినా స్పందించరు. కొద్దిరోజులుగా హంసపాల్ ప్రవర్తనపై అనేక ఫిర్యాదులు ప్రభుత్వానికి చేరాయి. దీంతో ఆయనపై వేటు పడింది.

ఇళ్ల పట్టాల చెరలో..

(5వ పేజీ తరువాయి)

ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

మొత్తం 1,200 పట్టాలు ఇచ్చాం : వంశీ అనుచరులు

నాడు అవుటపల్లిలో జరిగిన అంతర్గత సమావేశంలో నియోజకవర్గవ్యాప్తంగా 1,200 పట్టాలు పంపిణీ చేయాలని మాజీ ఎమ్మెల్యే వంశీ తమను ఆదేశించారని, ఆయన ఆదేశాల మేరకే అలా చేశామని, ఎన్నికలు జరిగాక నకిలీ ఇళ్ల పట్టాల కేసు వెలుగు చూడటంతో వంశీ అనుచరులు కొందరు రంగంలోకి దిగి పొజిషన్ సర్టిఫికెట్లు ఇస్తామని మభ్యపెట్టి పంపిణీ చేసిన ఇళ్ల పట్టాలన్నీ తిరిగి తీసుకున్నారని బాపులపాడు టీడీపీ నాయకులు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. బాపులపాడు మండలంలో సుమారు 400, ఉంగుటూరు, గన్నవరం టౌన్, గన్నవరం గ్రామీణ ప్రాంతాల్లో 600, విజయవాడ గ్రామీణ ప్రాంతంలో 200 పట్టాలను అదే సమావేశంలో టీడీపీ నాయకులతో పంపిణీ చేయించారని చెప్పారు. తరువాత జరిగిన పరిణామాల వల్ల ఎమ్మెల్యే వంశీ వైసీపీలోకి వెళ్తూ తమను కూడా రమ్మన్నారని, తాము నిరాకరించడంతో స్థానిక అనుచరులతో తమపై కేసులు నమోదు చేయించారని తెలిపారు. ఆ ఫలితంగానే ఆరేళ్లుగా నూజివీడు కోర్టుకు వాయిదాలకు వెళ్లొస్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

పృథ్వీశ్వరుడి భూములు స్వాహా..!

(5వ పేజీ తరువాయి)

అధికారులు అడంగల్‌లో పేర్లు మార్చటంతో పాటు పాస్ పుస్తకాలు కూడా జారీ చేసినట్లు సమాచారం.

భూములు పరిశీలించిన అధికారులు

యలమర్రులోని 50.06 ఎకరాల దేవస్థానం భూములను దేవదాయ శాఖ అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్.నాగేశ్వరరావు, దేవదాయ శాఖ అధికారి సుబ్బారెడ్డి, పృథ్వీశ్వరస్వామి ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు.. పెదపారుపూడి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి భూముల విషయమై ఆరా తీశారు. అనంతరం యలమర్రులోని దేవస్థానం భూములను గ్రామస్థులతో కలిసి పరిశీలించారు.

పేర్లు మారుస్తాం..

అడంగల్‌లో పేర్ల మార్పుల గురించి గతనెలలో పెదపారుపూడి తహసీల్దార్ కార్యాలయంలో అర్జీ అందించాం. రీ సర్వే నిర్వహించిన అనంతరం సదరు భూములకు సంబంధించి అడంగల్‌లో స్వామివారి పేర్లు నమోదు చేస్తామని తహసీల్దార్ కార్యాలయం వారు తెలిపారు.

- యార్లగడ్డ శ్రీనివాసరావు, పృథ్వీశ్వరస్వామి ఆలయ ఈవో

బుడమేరు ప్రక్షాళన ప్రారంభం

(5వ పేజీ తరువాయి)

సాగుతున్నాయి. మూడు విడతలుగా జరుగుతున్న ఈ పనులను జూన్ 10 నాటికి పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

52,500 క్యూసెక్కుల వరద మళ్లింపే లక్ష్యం

వరదల సమయంలో బుడమేరు వరద మళ్లింపు కాల్వ (బీడీసీ)కు తరచూ ఒకే ప్రాంతంలో గండ్లు పడుతున్నాయి. దీనివల్ల అటు రైతులు, ఇటు ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. విజయవాడ పల్లపు ప్రాంతాలు ముంపు బారిన పడటం వంటి వాటి నుంచి కాపాడాలంటే గండ్లు పడిన ప్రాంతంలో రక్షణ గోడ నిర్మించడం ఒక్కటే శాశ్వత పరిష్కారంగా భావించిన ప్రభుత్వం ఆ దిశగా పనులు ప్రారంభించింది.

కాల్వకు సమాంతరంగా మరో కాల్వ

వర్షాకాలంలో అతిభారీ వర్షాల సమయంలో ఎగువ నుంచి వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వరకు ఎంత పెద్ద ఎత్తున వరద నీరు వచ్చినా కట్టలకు, రెగ్యులేటర్‌కు ఇబ్బంది లేకుండా మళ్లించేందుకు అవసరమైన ప్రణాళికను జలవనరుల శాఖ సిద్ధం చేసింది. రెగ్యులేటర్ దిగువ భాగంలో నుంచి ఎనికేపాడు యూటీ వరకు ఉన్న పాత కాల్వకు సమాంతరంగా మరో కాల్వ తవ్వాలనే ప్రణాళికలు తయారుచేసింది. పాత కాల్వ, దాని సమాంతర కాల్వ ద్వారా మొత్తం 25 వేల క్యూసెక్కులు నేరుగా కొల్లేరులో కలిపేందుకు చర్యలు తీసుకోనున్నారు. అందుకు అవసరమైన భూమిని సేకరించే పనిలో ఉన్నారు. రెగ్యులేటర్ వద్దకు వచ్చే వరదను బీడీసీ ద్వారా 37,500 క్యూసెక్కులు మళ్లించేలా కట్టలను బలోపేతం చేయాలని సంకల్పించారు. ఇందులో భాగంగానే మూడు గండ్లు పడిన చోట రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టారు. ఇలా వచ్చే వరదను సాధ్యమైనంత వరకు బీడీసీ ద్వారానే కృష్ణానదిలో కలిపి, కాల్వ సామర్థ్యం మించి వచ్చే వరదను రెగ్యులేటర్ దిగువ భాగంలోని కాల్వల ద్వారా కొల్లేటిలో కలిపేందుకు ప్రభుత్వం డీపీఆర్ సిద్ధం చేసింది. ఇందుకు కేంద్ర సాయం కూడా కోరనున్నట్లు మంత్రి నిమ్మల తెలిపారు. ముందు రిటైనింగ్ వాల్ పూర్తయితే సాధ్యమైనంత వరకు బుడమేరు వరద నుంచి విజయవాడ పల్లపు ప్రాంతాలను కాపాడినట్టేనన్న అభిప్రాయంలో అటు అధికారులు, ఇటు ప్రభుత్వం ఉంది. అయితే, వర్షాలు ప్రారంభం కాకముందే రిటైనింగ్ వాల్ పూర్తి చేయాల్సిన అవసరం ఉంది.

జోరువాన

(5వ పేజీ తరువాయి)

కొట్టుకుపోయాయి. దీంతో ధాన్యం తడిసిపోయింది. ఉయ్యూరు మండలంలోని పలు గ్రామాల్లో రహదారులపై వర్షపునీరు నిలిచిపోయింది. మచిలీపట్నంలో తేలికపాటి వర్షం కురిసింది. బలమైన గాలుల తాకిడికి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అవనిగడ్డ నియోజకవర్గంలోని మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. తోట్లవల్లూరు మండలంలోని లంక గ్రామాల్లో ఆరబెట్టిన మొక్కజొన్న తడిసిపోయింది. పెడన నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసింది. పెనమలూరు మండలంలోని పలు గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి. పామర్రు, బాపులపాడు మండలాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కాగా, రానున్న రెండు రోజుల పాటు కోస్తాతీరం వెంబడి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ హెచ్చరించింది.



మణప్పురం ఫైనాన్స్ కంపెనీ

మణప్పురంలో బంగారం గోల్‌మాల్!

- కార్యాలయానికి తాళం వేసిన బాధితురాలు

మచిలీపట్నం టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : బుట్టాయిపేటలోని మణప్పురం గోల్డ్ ఫైనాన్స్ కంపెనీలో బంగారం కుదువపెట్టిన ఓ మహిళ తన బంగారం మాయం కావడంతో ఆందోళనకు దిగింది. మచిలీపట్నంలో జరిగిన ఈ సంఘటన సంచలనం రేకెత్తించింది. 2022లో 123 గ్రాముల బంగారం తాకట్టు పెట్టి గొర్రుముచ్చు దీప్తి రూ.5 లక్షల 50 వేలు రుణం తీసుకుంది. దశల వారీగా రుణాన్ని 2023 జనవరికి వడ్డీతో సహా చెల్లించింది. కుదువపెట్టిన బంగారం ఇవ్వాలని అప్పటి బ్యాంకు మేనేజర్‌ను కోరింది. బ్యాంకు మేనేజర్ బంగారం తిరిగి ఇవ్వలేదు. అప్పటి నుంచి ఆమె ఫైనాన్స్ కంపెనీ చుట్టూ తిరుగుతూనే ఉంది. విసిగిపోయి ఆమె శుక్రవారం బ్యాంకుకు తాళాలు వేసింది. రుణం తీర్చినా బంగారం ఎందుకు ఇవ్వలేదని మేనేజర్‌ను నిలదీసింది. తాను మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించి రెండు నెలలే అయిందని, ఉన్నతాధికారులకు విషయం తెలియజేస్తానని మేనేజర్ చెప్పాడు. 2022 నుంచి పనిచేసిన మేనేజరే దీనికి బాధ్యుడని, తాను కాదని ప్రస్తుత మేనేజర్ ప్రసాద్ చెప్పినప్పటికీ ఆ మహిళ వినలేదు. దీంతో ఆగ్రహించిన బాధితురాలు కార్యాలయానికి తాళాలు వేసి వెళ్లిపోయింది. దీంతో మేనేజర్ ఉన్నతాధికారులకు ఫోన్‌లో విషయం తెలియజేశాడు. బాధితురాలికి జనసేన నేత గడ్డంరాజు తదితరులు మద్దతు తెలిపారు.



కంపెనీకి తాళం వేస్తున్న బాధితురాలు దీప్తి

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 525

లక్ష్మీ తిరుపతమ్మ కల్యాణ వేదికకు విరాళం అందజేత

గన్నవరం, మే 16 (ఆంధ్రజ్యోతి): పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మించిన కల్యాణ వేదికకు ఇద్దరు దాతలు విరాళాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్‌కు శుక్రవారం అందజేశారు. పట్టణానికి చెందిన నర్రా ప్రసాద్ భ్రమరాంబ దంపతులు రూ.50వేలు, నర్రా మనీష్ రూ.50వేలు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ మాట్లాడుతూ, దాతలు ఆలయ అభివృద్ధికి సహకరించటం అభినందనీయమన్నారు.



రైతులకు కడగండ్లు!

- కాలువల్లో దట్టంగా పేరుకుపోయిన గుర్రపుడెక్క తూడు
- బుడమేరు వరదలకు కాలువలు, వాగులకు పడిన గండ్లు
- సార్వా సీజన్ దగ్గర పడుతున్నా పూడ్చడంలో నిర్లక్ష్యం
- ఆందోళనలో రైతులు



ముక్కపాడు వద్ద వన్నేరువాగుకి పడిన భారీగండి

(ఉంగుటూరు - ఆంధ్రజ్యోతి)

మండలంలో ప్రధాన సాగునీటి వనరులైన బుడమేరు, ఏలూరు కాలువతోపాటు ఉపఛానళ్ల లో గుర్రపుడెక్క, తూడు దట్టంగా అలముకుని నీటిప్రవాహానికి అడ్డంకిగా మారాయి. దీంతో చివరభూములకు సాగునీరందక రైతులు ప్రతిఏటా పంటలు నష్టపోతున్నారు. నీటిపారుదల వ్యవస్థ ప్రక్షాళనపట్ల గత వైసీపీ ప్రభుత్వం శ్రద్ధచూపకపోవడం, ఇరిగేషన్ అధికారుల అలసత్వం కారణంగా కాలువల పరిస్థితి దారుణంగా తయారైంది. పంటల సీజన్ ముగిసిన తర్వాత కాలువల్లోని గుర్రపుడెక్క, తూడు, చెత్త, ప్లాస్టిక్ తదితర వ్యర్థాలను తొలగించి గట్లను పటిష్టపరిచే పనులు చేపట్టాల్సిన అధికారులు గతకొన్నేళ్లుగా ఈవిధానానికి స్వస్తిపలకడంతో కాలువల అభివృద్ధి పనులు కుంటుపడ్డాయి. దీనికితోడు గత ఏడాది సంభవించిన బుడమేరు వరదలకు బలహీనంగా వున్న కాలువలు, వాగుల కరకట్లకు పలుచోట్ల గండ్లు పడి వేలాది ఎకరాల్లో పంట నీటిముంపునకు గురై రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారు. వేసవి పూర్తై వర్షాకాలం వచ్చినా నిధుల విడుదలలో జాప్యం కారణంగా కాలువల గండ్లు పూడ్చివేత, మరమ్మతు పనులు ముందుకు సాగక ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. దీంతో ఈ ఏడాది ఖరీఫ్ సాగుపై రైతుల్లో సందిగ్ధత నెలకొంది. జూన్ నెలాఖరులోపు గండ్లు పూడ్చకపోతే సార్వాసాగు చేపట్టలేమని, స్వచ్ఛందంగా క్రాప్ హాలిడే ప్రకటిస్తామని రైతులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అన్నదాతల ఆవేదనను అర్థం చేసుకుని సాగునీటి కాలువల గండ్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి బలహీనమైన కరకట్లను పటిష్టపరచాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



తరిగొప్పుల వద్ద బుడమేరులో దట్టంగా పేరుకుపోయిన గుర్రపుడెక్క

నేటి నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు

హనుమాన్‌జంక్షన్, మే 16 (ఆంధ్ర జ్యోతి) : స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమజ్జయంతి ఉత్సవాలను దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చేతులు మీదుగా ప్రారం భిస్తున్నట్లు దేవస్థానం ఈవో పి. తారకేశ్వరరావు తెలిపారు. ఉదయం సుప్రభాత సేవ, అర్చనలతో స్వామి వారికి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం ఎమ్మెల్యే చింత మనేని ప్రభాకర్ లాంఛనంగా ఉత్సవాలను ప్రారంభిస్తారని భక్తులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.



గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న బాపులపాడు పీహెచ్‌సీ సిబ్బంది

డెంగ్యూపై అవగాహన ర్యాలీ

హనుమాన్‌జంక్షన్, మే 16 (ఆంధ్ర జ్యోతి) : డెంగ్యూపై ప్రజలు అవగాహనతో ఉన్నపుడే ప్రాథమిక దశలోనే నివారించుకోవచ్చని మలేరియా విభాగం గన్నవరం సబ్ యూనిట్ అధికారి ఆర్.వెంకట్రాజు తెలిపారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా శుక్రవారం బాపులపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహిం చారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కుంటలు, తొట్లెల్లో నీరు నిల్వ ఉంచకుండా జాగ్రత్తలు తీసుకో వాలని సూచించారు. గ్రామంలోని పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించి వ్యాధి నియంత్రణకు తీసు కోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఫణికుమార్, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత నేడు

హనుమాన్‌జంక్షన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : జంక్షన్ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతు పనులను శనివారం చేపట్టనున్నట్టు జంక్షన్ సెక్షన్ ఇన్‌చార్జి ఏఈ యు.మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో బాపులపాడు, శేరీనరసన్నపాలెం, కె.సీతారాంపురం, ముందడుగు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11 గంటలు వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.



ముదునూరులో ఆధార్‌కార్డు ప్రయోజనాలు తెలియజేస్తున్న ఎంపీడీవో శేషగిరిరావు

ప్రత్యేక క్యాంపుల ద్వారా ఆధార్ కార్డుల జారీ

ఉయ్యూరు, మే 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఊరచెరువు కట్టలు, కాల్వగట్లపైన గుడిసెలు వేసుకుని నివసిస్తున్న ఎస్టీ, ఇతర సంచార కులాల వారికి ప్రత్యేక క్యాంపులు నిర్వహించి ఆధార్ కార్డులు జూన్ 2లోగా అందించేలా చర్యలు తీసుకున్నట్టు ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. ముదునూరులో శుక్రవారం పర్యటించి చెరువు కట్టలపై నివసిస్తున్న యానాది కులాల కుటుంబాలతో మాట్లాడి ఆధార్ కార్డుల అవసరం, ప్రయోజనాలను వివరించి అవగాహన కల్పించారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

పెనమలూరు, మే 16 (ఆంధ్రజ్యోతి) : తండ్రి మద్యం తాగవద్దన్నందుకు మనస్తాపం చెంది ఒక యువకుడు ఆత్మహత్య చేసుకొన్న ఘటన తాడిగడప కార్మికనగర్ కట్టపై జరిగింది. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడిగడప కార్మికనగర్ కట్టకు చెందిన బావిశెట్టి సురేష్(39)కు పదిహేనేళ్ల క్రితం వివాహమైంది. మనస్పర్థల కారణంగా భార్యతో విడాకులు తీసుకొన్నాడు. ఇతనికి మద్యం సేవించే అలవాటు ఉంది. బుధవారం మద్యం సేవించి ఇంటికి రాగా అతని తండ్రి మద్యం మానేయాలని గట్టిగా చెప్పాడు. దీంతో మనస్తాపం చెందిన సురేష్ ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆన్‌లైన్ జాబ్ పేరుతో రూ.13 లక్షలకు టోపి

మీరు వర్క్ ఫ్రం హోం జాబ్ కోసం చూస్తున్నారా..అని టెలిగ్రాం యాప్‌ద్వారా లింక్ రాగా ఒక గృహిణి లింక్‌ను క్లిక్ చేసి కొంత సొమ్మును లావాదేవీ జరిపి తన ఖాతాలో ఉన్న పదమూడు లక్షలను పోగొట్టుకున్న ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... యనమలకుదురుకు చెందిన గృహిణి స్వాతికి వారం క్రితం టెలీగ్రాం యాప్‌లో ఒక ఆన్‌లైన్ జాబ్ గురించి లింక్ వచ్చింది. ఆమె ఆ లింక్‌ను క్లిక్ చేయగా 50 రూపాయలు చెల్లించండని మెసేజ్ వచ్చింది. ఆమె 50పంపగా ఆమె ఖాతాకు వెయ్యి రూపాయలు క్రెడిట్ అయ్యాయి. ఆపైన ట్రేడింగ్ పనులు చెయ్యమని కొన్ని లింక్స్‌ను అవతలి వారు పంపి మీఖాతాకు జీతాలు క్రెడిట్ అవుతాయని నమ్మ బలకడంతో ఆమె నమ్మి రూ. 13లక్షల వరకు పెట్టుబడులు పెట్టింది. తర్వాత అవతలి వ్యక్తులు ఫోన్‌కు సమాధానం చెప్పకపోవడంతో తాను మోసపోయానని గ్రహించి పెనమలూరు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.



నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలుపుతున్న మారుపూడి, ఆనంద్ ప్రసాద్

టీడీపీ పెనమలూరు అధ్యక్షుడిగా ఉదయభాస్కర్

పెనమలూరు, మే 16 (ఆంధ్రజ్యోతి) : పెనమలూరు టీడీపీ గ్రామ అధ్యక్షుడిగా సీనియర్ నాయకులు తోటకూర ఉదయభాస్కర్ ఎంపికయ్యారు. శుక్రవారం పెనమలూరు టీడీపీ కార్యాలయంలో క్లస్టరు ఇన్‌చార్జి మారుపూడి ధనకోటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు కోయ ఆనంద్‌ప్రసాద్‌ల నేతృత్వంలో జరిగిన ఎంపిక కార్యక్రమంలో గత అధ్యక్షురాలు బొమ్మిడి అన్నపూర్ణ నుంచి ఉదయభాస్కర్ బాధ్యతలు స్వీకరించారు. ఉపాధ్యక్షుడిగా మోర్ల నరేంద్ర ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంగెపు రంగారావు, కృష్ణవేణి, పాములు బలరాం, శీలం ఆదాం, షేక్ సైదులు, వీరరాఘవులు, అబ్దుల్ సలాం, పిడికిటి శ్రీనివాసరావు, పిల్లి విజయ్, కిలారు శ్రీనివాసరావు, మట్టపర్తి బుజ్జి, చిగురుపాటి శ్రీనివాసరావు, కిలారి సుబ్బారావు, అరవపల్లి శివప్రసాద్, యలమంచిలి ప్రసాద్ పాల్గొన్నారు.

చెరువులో పడి వృద్ధుడు మృతి

కంకిపాడు, మే 16 (ఆంధ్రజ్యోతి) : చెరువులో పడి వృద్ధుడు చిన్నా మృతి చెందాడు. సేకరించిన సమాచారం మేరకు.. కంకిపాడుకు చెందిన పెన్నేరు రామచంద్రరావు (చిన్నా) 64 ఏళ్ల ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. ప్రతి రోజు ఉదయం ప్రొద్దుటూరు శివారు కొణతనపాడు చెరువు గట్టుకు వెళ్లి కాలకృత్యాలు తీర్చుకుం టూ ఉంటాడు. అదే క్రమంలో శుక్రవారం వేకువజామున చెరువుకు వెళ్లి తిరిగి రాలేదు. ఉద యం 7.30 గంటల సమయంలో చిన్నా మృతదేహం చెరువులో కనిపించింది. దీంతో సమాచారం అందుకున్న కంకిపాడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై డి. సందీప్ తెలిపారు.



చెరువులో పడి మృతి చెందిన చిన్నా



చినఓగిరాల ప్రాథమిక పాఠశాల రోడ్డులో నిలిచిన వర్షం నీరు

పల్లపు ప్రాంతాలు జలమయం

మండలంలో 87.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

ఉయ్యూరు, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు నగర పంచాయతీ, మండల పరిధి గ్రామాల్లో శుక్రవారం తెల్లవారుఝామున 87.2 మిల్లీ మీటర్ల వర్షం కురవగా పల్లపు ప్రాంతాల్లో నీరునిలిచి ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షంతో ఉయ్యూరులో ప్రధాన రహదారులు, గండిగుంటలో సర్వీసురోడ్డు, చినఓగిరాలలో పలు చోట్ల నీరు నిలిచింది. గ్రామంలో డ్రైనేజి వ్యవస్థ లేకపోవడంతో వర్షం కురిసినప్పుడు నీరుపోయేమార్గం లేక నిలిచిపోతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మండు వేసవిలో కురుస్తున్న అకాల వర్షాలు రైతులకు నష్టం వాటిల్లజేస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు.

ఉంగుటూరు మండలంలో..




ఉంగుటూరు : మండలంలోని పలుగ్రామాల్లో శుక్రవారం తెల్లవారుజామున ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. వేకువజామున మూడున్నరగంటలకు గాలులతో ప్రారంభమైన వర్షం సుమారు గంటసేపు కుండపోతగా కురిసింది. ఇందుపల్లి, నారయ్యఅప్పారావుపేట గ్రామాల్లో పలుచోట్ల చెట్లకొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడటంతో కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈదురుగాలులకు తేలప్రోలు, పెదఅవుటపల్లి, ఆత్కూరు పొలాల్లో ఆరు విద్యుత్‌స్తంభాలు విరిగి ఒరిగిపోయాయి. వెంటనే స్పందించిన విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది యుద్ధప్రాతిపదికన మరమ్మతు చర్యలు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చొరవతో

మురుగు సమస్యకు పరిష్కారం

గన్నవరం, మే 16 (ఆంధ్రజ్యోతి) : సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చొరవతో పరిష్కారానికి నోచుకుంటున్నాయి. మండలంలోని కేసరపల్లి శివారు దుర్గాపురంలో గత కొన్నేళ్లుగా డ్రెయినేజీ సమస్య వెంటాడుతోంది. హెచ్‌సీఎల్ గోడను ఆనుకుని ఉన్న ప్రధాన డ్రెయిన్ పూడిక తీయకపోవడంతో ప్రతి ఏటా వర్షాకాలం భారీ వర్షాలు కురిసినప్పుడు దుర్గాపురం కాలనీ జలమయ్యేది. ఇటీవల గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన సమస్యల పరిష్కార వేదికలో దుర్గాపురం వాసులు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును కలసి తమ కాలనీలో ఉన్న సమస్యలపై వినతిపత్రం అందించారు. స్పందించిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తక్షణమే డ్రైనేజీ పూడికతీత పనులు చేపట్టాలని, పనులు పూర్తి చేసి తనకు ఫొటోలు పెట్టాలని గ్రామ పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి దగ్గరుండి పనులు చేయిస్తున్నారు.



డ్రెయినేజీ పనులను పర్యవేక్షిస్తున్న పంచాయతీ కార్యదర్శి ప్రసాద్



పెద ఓగిరాలలో తడిసిన పసుపు కొమ్ములు ఎండబెడుతున్న కూలీలు



పెద ఓగిరాలలో ఆరబెట్టిన మొక్కజొన్న కండెలు



వల్లూరుపాలెంలో తడిసిన మొక్కజొన్నలు ఆరబెడుతున్న రైతులు

అకాల వర్షం.. రైతుకు నష్టం

తడిసిన పసుపు, మొక్కజొన్న

ఉయ్యూరు, తోట్లవల్లూరు మండలాల పరిధిలో శుక్రవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షం రైతులకు నష్టాన్ని మిగిల్చింది. పసుపు, మొక్కజొన్న, ధాన్యం రాశులపై పట్టాలు కప్పినప్పటికీ అవి గాలులకు లేచిపోయి పంట తడిచిపోయింది. గుడివాడలో కురిసిన భారీ వర్షానికి బస్టాండ్ నీట మునిగింది. శివారు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. గాలులకు పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి.



వల్లూరుపాలెంలో తడిసిన కండెలకు మొలకలు



మొక్కజొన్నపంటపై కప్పిన పరదాలపైన వర్షపు నీరు



బొడ్డపాడు పొలాల్లో విరిగిపడిన ట్రాన్స్‌ఫార్మర్

ఉయ్యూరు/తోట్లవలూరు, మే 16(ఆంధ్రజ్యోతి): ఉయ్యూరు మండల పరిధిలో శుక్రవారం తెల్లవారుజామున కురిసిన భారీవర్షానికి పసుపు, మొక్కజొన్న, దాళ్వా రైతులకు భారీ నష్టం కలిగింది. ఉరుములు, మెరుపులు, తీవ్రగాలులతో రెండుగంటలకు పైగా కురిసిన వర్షానికి పొలాల్లో ఎండబెట్టిన పసుపుకొమ్ములు, మొక్కజొన్న, రాశులపై ఉన్న ధాన్యం తడిసింది. ఉడకపెట్టిన పసుపుకొమ్ములు, కోసి ఎండబెట్టిన మొక్కజొన్న కండెలపై పట్టాలు కప్పినప్పటికీ గాలులకు లేచిపోయి తడిసిపోయాయి. పెదఓగిరాలలో పసుపు, మొక్కజొన్న కల్లాల్లో నీరునిలిచిపోవడంతో తడిసిన వాటిని వేరే చోటికి చేర్చి ఆరబెట్టుకునేందుకు రైతులు అవస్థలు పడ్డారు. చినఓగిరాలలో ధాన్యం రాశులపై పట్టాలు కప్పినప్పటికీ తడిసిపోయింది.

అకాల వర్షం నిండా ముంచింది

ఐదెకరాల్లో పసుపు పండించి కొమ్ములు కల్లంలో ఎండబెట్టాం. వర్షానికి నీరు నిలిచి తడిసిపోయింది. తడిసిన పసుపుకొమ్ములు బయటకు తెచ్చి రోడ్లపై ఆరబెట్టడానికి ఖర్చు తడిసి మోపెడవుతుంది.

- అంజిరెడ్డి, రైతు, పెద ఓగిరాల

చేతికొచ్చిన పంట తడిచింది



ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతి కొచ్చిన సమయంలో అకాల వర్షం వచ్చింది. ఆరబెట్టిన మొక్కజొన్న తడిసిపోయింది. కండెలు గుట్టగాచేసి పట్టాలుకప్పినా గాలికి లేచిపోయాయి.

-పెనుముత్స నరసింహ, రైతు, పెద ఓగిరాల

గుడివాడలో భారీ వర్షం

- నీటమునిగిన బస్టాండ్
- ధనియాలపేటలో ఇళ్లలోకి చేరిన వర్షపునీరు



ధనియాలపేటలో ఇంట్లోకి చేరిన వర్షపు నీరు

గుడివాడ: పట్టణంలో శుక్రవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. పట్టణంలోని శివారు ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. వారంరోజులుగా పెరిగిన ఉష్ణోగ్రతలతో సతమతమవుతూ, ఉక్కపోతలతో అల్లాడుతున్న పట్టణ ప్రజలకు భారీ వర్షం ఊరటనిచ్చింది. భారీ ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల చెట్టు నేలకొరిగాయి. ధనియాలపేటలో ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. పలుచోట్ల డ్రెయినేజీలు పొంగి రహదారికిపైకి మురుగునీరు చేరింది. గుడివాడ బస్టాండ్ దారుణంగా మారింది. బస్టాండ్ నీట మునిగింది. ప్రయాణికులు బస్సులు ఎక్కేందుకు ప్రయాణికులు నానాపాట్లు పడ్డారు.

తోట్లవల్లూరు మండలంలో ఉరుములు, పిడుగులతో భారీ వర్షం

శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో మెరుపులు, ఉరుములు, పిడుగులతో భారీ వర్షం కురిసింది. గంటన్నరపాటు భారీశబ్దాలతో ఉరుములు, మెరుపులు రావటం గతంలో తామెప్పుడు చూడలేదని పెద్దలు చెబుతున్నారు. ఈ అకాల భారీ వర్షానికి వల్లూరుపాలెం, పలు లంకగ్రామాల్లో మొక్కజొన్న పంట తడిసింది. కొన్నిచోట్ల మొలకలు వస్తున్నాయని రైతులు తెలిపారు. బొడ్డపాడులో భారీ గాలికి సింగిల్‌ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ స్తంభాలతో సహా విరిగిపడిపోయింది. పలుచోట్ల చెట్లకొమ్మలు విరిగాయి. పిడుగులు పొలాల్లో పడటం వల్ల ఎక్కడా ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు.



నందిగామలో నిరుపయోగంగా ఉన్న అధునాతన భూసార పరీక్షా కేంద్రం

భూసార పరీక్షల నిర్వహణలో జాప్యం!

- జిల్లాలోని అన్ని మట్టి నమూనాలకు గొల్లపూడి కేంద్రంలోనే పరీక్షలు
- నందిగామలో కేంద్రం ఉన్నా వినియోగించని అధికారులు
- వచ్చే నెల నుంచి తొలకరి ప్రారంభం
- ఎప్పటికి రిపోర్టులిస్తారని ప్రశ్నిస్తున్న రైతులు

(ఆంధ్రజ్యోతి-నందిగామ): వ్యవసాయ శాఖ అధికారులు సేకరించిన శాంపిల్స్‌ను గొల్లపూడి మార్కెట్ యార్డులోని జిల్లా భూసార పరీక్షా కేంద్రానికి తరలిస్తున్నారు. జిల్లా మొత్తానికి ఈ ఒక్క కేంద్రమే ఉండడంతో అన్ని ప్రాంతాల నుంచి మట్టి నమూనాలను అక్కడికే తీసుకొస్తున్నారు. ఒక్కసారిగా భారీగా నమూనాలు జమ కావడంతో భూసార పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించడం సాధ్యం కాని పని. ఒక్కొక బ్యాచ్‌కు అరవై నమూనాలు పరీక్షిస్తారు. ఇందు కోసం రెండు రోజులు పడుతుంది. ఈలెక్కన జిల్లాలోని అన్ని ప్రాంతాలకు చెందిన శాంపిల్స్ పరీక్షించాలంటే చాలా సమయం పడుతుంది. దీంతో హడావుడిగా పరీక్షలు నిర్వహిస్తున్నారని రైతులు అంటున్నారు. మార్చి నెలాఖరు నుంచి సేకరిస్తే బాగుంటుందని, మే సగం దాటినా నమూనాల సేకరణలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని, ఎప్పటికి రిపోర్టులు అందిస్తారని రైతులు ప్రశ్నిస్తున్నారు.

వ్యవసాయంలో ఎరువులు, నీటి యాజమాన్య పద్ధతులు అవలంబించడానికి భూసార పరీక్షల ఫలితాలు అవసరం. కానీ, వ్యవసాయశాఖ పరీక్షల భూసార పరీక్షల నిర్వహణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఏప్రిల్, మేలో పరీక్షలు పూర్తి చేయాల్సిన అధికారులు ఇప్పటికి 30 శాతం కూడా నిర్వహించలేదు. జూన్ నుంచి తొలకరి ప్రారంభం కానున్న నేపథ్యంలో నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకునే పరిస్థితి లేదు. గ్రామస్థాయిలో పని చేసే వీపీఏలు కూడా ఆయా గ్రామాల్లో పలుకుబడి ఉన్న రాజకీయ ప్రముఖుల భూముల నుంచి మాత్రమే శాంపిల్స్ సేకరిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే గ్రామాల్లో రైతులు వేసవి దుక్కులు వేయించారు. దుక్కులు వేసిన భూమిలో శ్యాంపిల్స్ తీసినా ఫలితం ఉండదు.

ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్కనమూనానైనా పరీక్షించని వైనం

భూసార పరీక్షల కోసం గతంలో టీడీపీ ప్రభుత్వం ముప్పై లక్షల వ్యయంతో అధునాతన పరికరాలతో నందిగామ మార్కెట్ యార్డులో ఒక భూసార పరీక్షా కేంద్రాన్ని నిర్మించింది. సుశిక్షితులైన సిబ్బందిని నియమించింది. మరో రూ.12 లక్షలతో సూక్ష్మ ధాతు పరీక్షల నిర్వహణకు పరికరాలను ఏర్పాటు చేసింది. దీంతో గొల్లపూడి కేంద్రానికి ఒత్తిడి తగ్గింది. నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల రైతులకు సౌకర్యంగా ఉంది. పని విభజన వల్ల నమూనాలను నిశితంగా పరీక్షించేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఈ కేంద్రాన్ని మూలన పెట్టారు. ఐదేళ్లలో ఒక్క నమూనా కూడా పరిశీలించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఆ కేంద్రంలో పరీక్షలు జరపకపోవడం వ్యవసాయాధికారుల నిర్లక్ష్యమే కారణమని రైతులు అంటున్నారు. తక్షణమే ఈ కేంద్రాన్ని ప్రారంభించాలని కోరుతున్నారు.

ఎన్టీఆర్ జిల్లా నమూనాల టార్గెట్

ఎన్టీఆర్ జిల్లా భూసార పరీక్షల టార్గెట్‌ను ప్రభుత్వం 14,864గా నిర్ణయించింది. ఇందులో ఇప్పటి వరకూ 7411 శాంపిల్స్‌ను సిబ్బంది సేకరించారు. అందులో సగం నమూనాలనే పరీక్షించినట్టు సమాచారం. మరో 7,453 నమూనాలను సేకరించి పరీక్షలు జరపాలి.





బాపట్ల జిల్లా నుంచి కప్తానుపాలెం వచ్చిన మట్టి, బుసక టిప్పర్లు

యథేచ్ఛగా మట్టి, బుసక రవాణా

- రాత్రి సమయాల్లో రెచ్చిపోతున్న మట్టి మాఫియా

మోపిదేవి, మే 16 (ఆంధ్రజ్యోతి): మట్టి, బుసక అనధికార రవాణా మండలంలో యథేచ్ఛగా కొనసాగుతోంది. రాత్రి సమయాల్లో రవాణాదారులు మరింత రెచ్చిపోతున్నారు. మండలం, జిల్లాలు దాటి మట్టి, బుసకను అనధికారికంగా మండలానికి రవాణా చేస్తున్నప్పటికీ నియంత్రించాల్సిన అధికారులు పట్టించుకోవటం లేదని ప్రజలు అంటున్నారు. మండలంలోని పెదప్రోలు పంచాయతీ శివారు కప్తానుపాలేనికి గురువారం అర్ధరాత్రి ఆరు టిప్పర్లలో బుసక, రెండు టిప్పర్లలో మట్టిని తీసుకొచ్చారు.

టిప్పర్లకు కారు అడ్డంగా పెట్టిన తెలుగు మహిళా నేతకు బెదిరింపులు

60 -70 టన్నుల లోడుతో టిప్పర్లు వస్తే అంతర్గత రహదారులు దెబ్బతింటాయని అనుమతి లేకుండా ఎలా రవాణా చేస్తారని గ్రామానికి చెందిన తెలుగు మహిళ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి దివి యుగంధరి కుటుంబసభ్యులతో కలిసి బుసక టిప్పర్లు వేసుకొచ్చిన వారిని ప్రశ్నించారు. మీరేం చేస్తారు.. మా ఇష్టం అంటూ వారు యుగంధరి కుటుంబసభ్యులతో వాగ్వాదానికి దిగడంతో టిప్పర్లు వెళ్లకుండా అడ్డుకునేందుకు కారును రహదారిపై అడ్డంగా నిలిపారు. మిమ్మల్ని, మీ కారును తొక్కించుకుని వెళ్తామని టిప్పర్లు వేసుకొచ్చిన వారు బెదిరింపులకు దిగారని యుగంధరి కుటుంబసభ్యులు, తెలిపారు. రెవెన్యూ, పోలీసులకు అర్ధరాత్రి సమయంలో తెలియజేసినా గంటలు వేచిచూసినా వారు రాకపోవడంతో ఈలోపు టిప్పర్లు పొలాల్లోనుంచి వెళ్లిపోయాయి. బాపట్ల జిల్లా బొబ్బర్లంక నుంచి మండలాలు దాటి మట్టి బుసక అక్రమ రవాణా సాగుతున్నా అధికారులు నియంత్రించడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే మోపిదేవి, పెదప్రోలు, కప్తానుపాలెం తదితర గ్రామాల్లో కోట్ల రూపాయలు వెచ్చించి వేసిన రహదారులు దెబ్బతింటున్నాయని, ఇప్పటికైనా అనధికార రవాణాదారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

మట్టి లారీలు పట్టుకున్నారు.. సీజ్ చేయకుండా వదిలేశారు!

- విమర్శలకు తావిచ్చేలా వీఆర్వో వ్యవహారం



పొట్టిదిబ్బలంకలో మట్టిలోడు లారీలకు అడ్డుపెట్టిన వీఆర్వో నాగేశ్వరరావు స్కూటీ

తోట్లవల్లూరు, మే 16(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి శివారు పొట్టిదిబ్బలంకలో అనధికార మట్టితవ్వకాలపై అధికారులు ఉదాశీనంగా ఉండటం అనేక సందేహాలకు తావిస్తోంది. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారా లేక అక్రమార్కులతో కుమ్మక్కవుతున్నారా అనే విమర్శలు వినిపిస్తున్నాయి. గురువారం పొట్టిదిబ్బలంకలో అనధికారికంగా మట్టిలోడుతో వస్తున్న రెండు లారీలను వీఆర్వో బి.నాగేశ్వరరావు తన స్కూటీని అడ్డుపెట్టి ఆపి, రెవెన్యూ అధికారులకు అప్పగించి సీజ్ చేయించకపోవటం విమర్శలకు తావిస్తోంది. మీడియా ముందు అతి చేసిన వీఆర్వో ఆ తర్వాత రెండు మట్టిలోడు లారీలను వదిలేయటం.. అక్రమార్కులతో రాజీ పడటమేనని విమర్శలు వస్తున్నాయి. రవాణా నిబంధనలను ఉల్లంఘించి వే బిల్లులు లేకుండా ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించకుండా అనధికారంగా మట్టిలోడుతో వెళుతూ పట్టుబడిన లారీలను సీజ్ చేసి పోలీస్ కేసు నమోదు చేయించకుండా..మట్టి మాఫియాను దర్జాగా వదిలిపెడితే అక్రమార్కులకు ఏం భయం ఉంటుందనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

20న మినీ జాబ్‌మేళా

కలెక్టరేట్, మే 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ అధ్వర్యంలో ఏపీ సీఆర్డీయే సౌజన్యంతో ఈనెల 20న ఉదయం 10 గంటలకు తుళ్లూరులోని సీఆర్డీయే స్కిల్ హబ్ కేంద్రంలో మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నారు. బీఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్, వరుణ్ మోటార్స్, స్కిల్‌క్రాఫ్ట్, వెఋన్ ఇండియా, ఐటీసీ, హ్యాపీ మొబైల్స్, ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్‌లు మేళాలో పాల్గొంటున్నాయి. ఎలక్ట్రీషియన్, ప్లంబర్, సర్వేయర్, ఇంజినీర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ట్రైనర్, క్లర్క్, మెషిన్ ఆపరేటర్ పోస్టులకు ఎస్ఎస్‌సీ, ఐటీఐ, డిప్లొమో, బీటెక్, ఏదైనా డిగ్రీ చదివిన ఫ్రెషర్స్, అనుభవం ఉన్నవారు హాజరుకావచ్చు. రూ.10 వేల నుంచి 30 వేల వరకు వేతనం లభిస్తుంది. అమరావతి, గుంటూరు, విజయవాడతో పాటు పరిసర ప్రాంతాలలో పనిచేయాలి. వివరాలకు గ్రామంలోని సీఆర్డీయే ఫెసిలిటేటర్‌ను సంప్రదించవచ్చు. లేదా శంకర్ - 98484 24207, శ్రీకర్ - 99634 25999 నెంబర్లకు కాల్ చేయొచ్చని, సీఆర్డీయే అధికారులు తెలిపారు. నైపుణ్యం పోర్టల్ హెచ్‌టీటీపీఎస్://నైపుణ్యం.ఏపీ.జీఓవీ.ఇన్/లో జాబ్ మేళాకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సూచించారు.

పకడ్బందీగా పది సప్లిమెంటరీ పరీక్షలు

- అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు డీఆర్వో లక్ష్మీనరసింహం ఆదేశం



మాట్లాడుతున్న డీఆర్వో లక్ష్మీ నరసింహం

కలెక్టరేట్, మే 16(ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో) ఎం. లక్ష్మీనరసింహం ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలో ఈనెల 19వ తేదీ నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే పదో తరగతి, ఈనెల 19వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే ఓపెన్ స్కూల్ సప్లమెంటరీ పరీక్షల పై అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు 6,149 మంది విద్యార్థులు హాజరవుతారని, ఇందుకోసం 30 కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలకు 1,677 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. పదో తరగతి రెగ్యులర్, ఓపెన్‌స్కూల్ టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు 59 మంది చీఫ్ సూపరింటెండెంట్లను, 7 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించామన్నారు. పరీక్షల నిర్వహణకు 300 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. 'పరీక్షల సమయంలో విద్యుత్‌కు అంతరాయం లేకుండా సరఫరాకు ముందస్తు ఏర్పాట్లు చూడాలి. పరీక్షా కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో జిరాక్సు కేంద్రాలు మూసివేయాలి. తాగునీరు అందుబాటులో ఉంచాలి. ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు, సెల్‌ఫోన్లు అనుమతించొద్దు. ఆర్టీసీ అధికారులు పరీక్షల సమయాలకు అనుగుణంగా విద్యార్థులకు బస్సులు నడపాలి. అన్ని పరీక్షా కేంద్రాలు సీసీ కెమెరాల నిఘాలో ఉంచాలి. స్ట్రాంగ్‌రూంల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలి.' అని అధికారులను డీఆర్వో ఆదేశించారు. సమావేశంలో డీఈవో యూవీ సుబ్బారావు, నగరపాలక సంస్థ, విద్యుత్, పోస్టల్ అధికారులు పాల్గొన్నారు.



అజిత్‌సింగ్‌నగర్‌లోని జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లు

నిరుపయోగంగా..

అజిత్‌సింగ్‌నగర్ జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లు

- పదేళ్లుగా ఎవరికీ కేటాయించని ప్రభుత్వాలు
- ఆకతాయిలకు అడ్డాగా గృహాలు.. మొక్కలు మొలిచి శిథిలావస్థలో భవనాలు



తాళాలు పగులకొట్టి మందుబాబులు అడ్డాగా మార్చుకున్న ఇల్లు

(ఆంధ్రజ్యోతి-అజిత్‌సింగ్‌నగర్): పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు నిర్మించిన జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లు నిరుపయోగంగా ఉన్నాయి. ఇళ్ల నిర్మాణం మొదలుపెట్టి పదేళ్లు దాటినా నేటికీ పేదలకు కేటాయించలేదు. నిర్మాణాలు పూర్తి చేసుకున్న ఇళ్లు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. పలు బ్లాకుల్లోని గృహాలు ఆకతాయిలకు అడ్డాగా మారుతున్నాయి. అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎక్సెల్ ప్లాంట్ సమీపంలో పదేళ్ల క్రితం జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్ల నిర్మాణాన్ని అప్పటి ప్రభుత్వం చేపట్టింది. 24 బ్లాక్‌లుగా బ్లాక్‌కు 32 చొప్పున మొత్తం 768 ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టారు. రెండేళ్లల్లోనే పనులు నిలిచిపోవడంతో అప్పట్లో పలు రాజకీయ పార్టీలు, ప్రజలు ఆందోళనలు చేపట్టడంతో తిరిగి ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారు. ఇళ్ల నిర్మాణం పూర్తయి ఎనిమిదేళ్లు పూర్తవుతున్నా నేటికి పూర్తిస్థాయిలో ఇళ్ల కేటాయింపులు జరగలేదు. 768 ఇళ్లకు 30 శాతం ఇళ్లను కేటాయించి మిగిలిన ఇళ్లను గాలికి వదిలేశారు. గృహాల్లో చాలా వరకు రాజకీయ కేటాయింపులు జరిగాయని విమర్శలు కూడా ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో పార్టీ కార్యకర్తలు, నేతలకు, సానుభూతిపరులకు ఇక్కడి ఇళ్లు కేటాయించి పేద ప్రజలను విస్మరించారని ఆరోపణలు ఉన్నాయి. నిర్మాణాలు పూర్తి చేసుకున్న జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లను పేదలకు త్వరితగతిన కేటాయించాలని పలువురు కోరుతున్నారు. గత ప్రభుత్వాలు ఇళ్లు కేటాయించకపోవడంతో అవి శిథిలావస్థకు చేరి ఆకతాయిలకు అడ్డాగా మారుతున్నాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లను పేదలకు కేటాయిస్తే పేదల సొంత ఇంటి కల నేరవేరుతుందని పలువురు కోరుతున్నారు.

గంజాయి బ్యాచ్‌లకు అడ్డాగా..

జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లు మందుబాబులు, గంజాయి బ్యాచ్‌లకు అడ్డాగా మారాయి. ఖాళీగా ఉన్న నివాసాల సముదాయాల మధ్య ఎక్కడ చూసినా చెత్త, చెదారం, మద్యం బాటిళ్లతో చిందరవందరగా కనిపిస్తున్నాయి. రాత్రిళ్లు ఇటువైపు వెళ్లే పరిస్థితి లేదు. పలు నివాసాలకు తాళాలు పగులకొట్టి గడియలు విరిచి ఆకతాయిలు ఆ ఇళ్లను తమ అడ్డాగా మార్చుకున్నారు.

సహజీవనం చేస్తున్న వ్యక్తే పొడిచి చంపాడు

- అనుమానంతోనే ఘాతుకం
- మహిళ హత్యకేసు వివరాలు వెల్లడించిన ఏసీపీ తిలక్
- నిందితుడి అరెస్టు

నందిగామ, మే 16(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన మహిళ మల్లెల దుర్గాస్రవంతిని ఈనెల 1న హత్యచేసి పరారైన అచ్చి నరసింహారావు(పెదబాబును) పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కళ్లుగప్పి పలు ప్రాంతాల్లో తలదాచుకున్న పెదబాబు కోర్టులో లొంగిపోయేందుకు నందిగామ వస్తుండగా, గురువారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ ఏబీజీ తిలక్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. 'మృతురాలు మల్లెల దుర్గాస్రవంతితో నిందితుడు అచ్చి నరసింహారావు కొద్దికాలంగా సహజీవనం చేస్తున్నాడు. ఆమెపై ఉన్న అనుమానంతో ఈ నెల 1న సాయంత్రం పట్టణంలోని ఎస్ఎస్‌పీ కాలనీ సమీపంలో ఉంటున్న స్రవంతి ఇంటికి వెళ్లాడు. అత్యంత కిరాతకంగా పొడిచి చంపాడు. అనంతరం పరారయ్యాడు. పెదబాబుపై నందిగామ స్టేషన్‌లో 8 కేసులు, తిరుపతిలో ఒక కేసు ఉన్నా యి. నిందితుడు పలు కేసుల్లో చిక్కుకున్న సమయంలోనూ స్రవంతి బెయిల్ ఇప్పించింది. పెదబాబుపై రౌడీషీట్ ఉండేది. వైసీపీ హయాంలో షీట్ తీసేశారు. తిరిగి రౌడీషీట్ ఓపెన్ చేస్తాం. పీడీ చట్టం కూడా ప్రయోగిస్తాం. నిందితుడి కోసం నాలు గు టీమ్‌లు ఏర్పాటు చేసి గాలించాం. ఆయన బంధువులు, స్నేహితులను విచారిస్తున్న సమయంలో మా సిబ్బందికి చిక్కాడు.' అని ఏసీపీ తెలిపారు. అనంతరం నరసింహారావును కోర్టులో హాజరుపరిచారు. సీఐ వైవీవీఎల్ నాయు డు, ఎస్సై అభిమన్యు పాల్గొన్నారు.

పదోన్నతి ఉత్తర్వులు జారీ అయ్యేలా చూడండి

- మంత్రి కొల్లు రవీంద్రతో ఏపీ ఎన్జీవో నేతలు శివారెడ్డి, విద్యాసాగర్



మంత్రి కొల్లు రవీంద్రతో మాట్లాడుతున్న ఏపీ ఎన్జీవో నేతలు

కలెక్టరేట్, మే 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఎక్సైజ్ ఉద్యోగులు, వివిధ శాఖలకు చెందిన సర్వీసు మేటర్ల ప్రమోషన్ల విషయంలో చర్యలు తీసుకోవాలని, గ్రామ, వార్డు సచివాలయాలలో వైద్య ఆరోగ్యశాఖ విభాగంలో విధులు నిర్వహిస్తున్న గ్రేడ్-3 ఏఎన్ఎంలకు ఏఎన్ఎంలుగా పదోన్నతులు కల్పించారని, ఉత్తర్వులు జారీ అయ్యేలా చూడాలని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.వి.శివారెడ్డి, ఎ.విద్యాసాగర్‌లు మంత్రి కొల్లు రవీంద్రను కోరారు. శుక్రవారం మంత్రిని ఎన్జీవో నాయకులు ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ప్రమోషన్ ఛానల్‌ను అందరికీ అందుబాటుగా ఉండేలా నిర్వహించాలని కోరారు. ఉద్యోగుల ఉపాధ్యాయులు పీఆర్సీ కమిషన్ నియామకంపై, పెండింగ్ డీఎల్ మంజూరు కోసం ఎదురు చూస్తున్నారని ఎన్జీవో నాయకులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఎన్టీఆర్ జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో సేవలందిస్తున్న ఏఎన్ఎంలకు పదోన్నతులు కల్పించాలని, ఏపీ ఎన్జీవో సంబంధిత అధికారులు దృష్టికి తీసుకొచ్చిందని మంత్రికి వివరించారు. మంత్రిని కలిసిన వారిలో ఎన్జీవో నాయకులు వీవీ ప్రసాద్, పి.రమేష్, సీవీఆర్ ప్రసాద్, ఎ.శ్రీనివాస్, వి.సీతారామయ్య, పురుషోత్తంరాజు, బి.వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

రాజధాని రైతుల సమస్యలకు సత్వర పరిష్కారం చూపండి

- గ్రీవెన్స్‌డేలో అధికారులతో సీఆర్డీయే అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్

కలెక్టరేట్, మే 16 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని అధికారులను ఏపీ సీఆర్డీయే అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ ఆదేశించారు. తుళ్లూరులోని సీఆర్డీయే కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేలో ఆయనకు కౌలు నగదు చెల్లింపు, ఎన్-13 రోడ్డు అలైన్‌మెంట్ మార్పు, వారసులకు ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, గ్రామకంఠం భూముల సమస్యలపై పలువురు రైతులు అర్జీలు అందించారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై అర్జీదారులు తెలియజేసిన సమస్యను అదనపు కమిషనర్ వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కౌలు నగదు చెల్లింపునకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల జరిగిన అనంతరం కౌలు నగదు రైతు బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని, గ్రామకంఠం భూములపై ప్రభుత్వ ఆదేశానుసారం చర్యలు తీసుకుంటామని అర్జీదారులకు అదనపు కమిషనర్ తెలియజేశారు. రాజధాని రైతుల ఫిర్యాదుల్లో అధికశాతం అక్కడికక్కడే పరిష్కారం చూపారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే గ్రీవెన్స్ డేను రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.స్వర్ణమేరీ, ఏజీ చిన్నికృష్ణ, బి.సాయిశ్రీనివాస్ నాయక్, జి.రవీందర్, ఎం.శేషిరెడ్డి, కె.ఎస్.భాగ్యరేఖ, పి.పద్మావతి, జి.భీమారావు, జీఆర్ఎం నోడల్ అధికారి పి.జయశ్రీ, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



బండ లాగుతున్న ఎడ్ల జత

హోరాహోరీగా బండ లాగుడు పోటీలు

నందిగామ రూరల్, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాలపాడు గ్రామంలో తిరునాళ్ల మహోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఎడ్ల బండ లాగుడు పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. శుక్రవారం జూనియర్స్ విభాగం ఒంగోలు జాతి ఎడ్ల బండ లాగుడు పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ఎనిమిది జతలు పాల్గొన్నగా 20 నిముషాల వ్యవధిలో 17.50 క్వింటాళ్ల బండ లాగినట్లు రైతు కమిటీ సభ్యులు తెలిపారు. ఎడ్ల యజమానులకు అంబారుపేట సత్యమ్మ అమ్మవారి ఆలయ మాజీ చైర్మన్ గరికపాటి భాస్కరం సోదరులు వస్త్రాలు, జ్ఞాపికలు అందజేశారు.

న్యూ కేటగిరీ విభాగం విజేతలు

గురువారం రాత్రి జరిగిన న్యూ కేటగిరీ ఎడ్ల జతల విభాగంలో పల్నాడు జిల్లా క్రోసూరు మండలం ఉయ్యందన గ్రామానికి చెందిన సంపటం వీరబ్రహ్మానాయుడు ఎడ్ల జత 3823.08 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచి రూ.50వేలు గెలుచుకుంది. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన జక్కుల సహస్రయాదవ్, కోదాడకు చెందిన డాక్టర్ షేక్ హేసేన్ ఎడ్ల జత 3559.08 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానంలో నిలిచి రూ.45 వేలు, రంగారెడ్డి జిల్లా మేడ్చల్ మండలం తుర్కంపల్లికి చెందిన రోహన్ బాబు ఎడ్ల జత 3505.10 అడుగుల దూరం లాగి తృతీయ స్థానంలో నిలిచి రూ.40 వేలు, కృష్ణాజిల్లా తోట్లవల్లూరు మండలం చినపులిపాక గ్రామానికి చెందిన ఆర్‌పీవీఎస్ బుల్స్, గన్నవరం మండలం తెంపల్లికి చెందిన కొలుసు శ్రీనివాసరావు యాదవ్ ఎడ్ల జత 3002 అడుగుల దూరం లాగి నాలుగో స్థానంలో నిలిచి రూ.35 వేలు గెలుచుకుందని కమిటీ సభ్యులు తెలిపారు.



తాగునీటి ఎద్దడి నివారణే ధ్యేయం

పెదపారుపూడి, మే 16 (ఆంధ్రజ్యోతి): వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పెదపారుపూడి ఎంపీపీ గోగం సురేష్ తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ మోపర్రులో ఫిల్టర్ బెడ్స్ కోసం మండల పరిషత్ నిధుల నుంచి మంజూరైన పనిని వెంటనే చేపట్టి పూర్తి చేయాలన్నారు. ఎంపీడీవో సయ్యద్ సాధిక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ షెహనాజ్, హౌసింగ్ ఏఈ ఫణి కుమార్, ఏపీవో సురేష్, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ గోగం సురేష్


ధర్నా చేస్తున్న మందపాడు న్యూకాలనీ వాసులు

ఎన్నికల హామీ నెరవేర్చాలని ధర్నా

గుడివాడ, మే 16 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ శివారు మందపాడు న్యూ కాలనీలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సీసీ రహదారులు, డ్రెయిన్లను, ఇంటి పన్ను వేయిస్తానని ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఇచ్చిన హామీలను నేరవేర్చాలని మందపాడు న్యూకాలనీ అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షురాలు డొక్కు నాగమణి డిమాండ్ చేశారు. శుక్రవారం కాలనీలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ న్యూకాలనీ ఏర్పడి 18ఏళ్లు అయిన కనీస మౌలిక వసతులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎమ్మెల్యే వెనిగండ్ల ఇచ్చిన హామీ మేరకు వెంటనే న్యూకాలనీకు రహదారులు, డ్రెయిన్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో కమిటీ కార్యదర్శి బొత్సలక్ష్మీ , కె.అరుణకుమారి, నాగరత్న, రమాదేవి, సాయిదేవి, లక్ష్మీకాంతం పాల్గొన్నారు.

గుంతల రోడ్లు .. తప్పని పాట్లు

● ధ్వంసమైన రహదారిపై వాహనదారులకు తప్పని సర్కస్ ఫీట్లు ● కొద్దిపాటి వర్షానికే గోతుల్లో నిలుస్తున్న వర్షపు నీరు

(ఆంధ్రజ్యోతి - పామర్రు): పెదమద్దాలి ప్రధాన సెంటర్‌లోని రహదారి పూర్తి అధ్వాన స్థితికి చేరుకుంది. ఈ రోడ్డుపై అడుగడుగునా గోతులు పడ్డాయి. దీంతో వాహనదారులు రాకపోకల సమయాల్లో నానా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. దీనికితోడు కొద్దిపాటి వర్షానికే గోతుల్లో వర్షపునీరు నిలిచిపోతుంది. దీంతో ఏది గోతో, ఏది రహదారో తెలియక వాహనదారులు నిత్యం రోడ్డు ప్రమాదాల బారీన పడక తప్పడం లేదు. పెదమద్దాలి నుంచి యలమర్రు వెళ్లే ప్రధాన రహదారిపై ఏర్పడ్డ గోతుల్లో నిలిచిన వర్షపు నీటితో గ్రామంలోకి వెళ్లేందుకు వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు గోతులకు మరమ్మతులు చేయించిన దాఖలాల్లేవని సర్వత్రా విమర్శలు వినవస్తున్నాయి ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పెదమద్దాలిలోని ప్రదాన రహదారి అభివృద్ధికి తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రామప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


పెదమద్దాలి ప్రధాన సెంటర్లో ఏర్పడిన గోతులు


పెదమద్దాలి-యలమర్రు వెళ్లే రహదారిపై నిలిచిన నీరు

రహదారికి మరమ్మతులు చేయాలి

గ్రామంలో ప్రధాన రహదారి పూర్తిగా గోతులతో నిండిపోయింది. దీంతో వాహనదారులు రాకపోకల సమయాల్లో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. ధ్వంసమైన ప్రధాన రహదారికి మరమ్మతులు చేయాలి.

వీరమాచినేని వెంకటేశ్వరరావు

నిధులు మంజూరు కాలేదు

కొత్తపెదమద్దాలి నుంచి యల్లమర్రు వెళ్లే రహదారి అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాలేదు. నిధులు మంజూరవగానే సంబంధిత రోడ్డు పునర్నిర్మాణానికి టెండర్లు పిలిచి నిర్మాణ పనులు చేపడతాం.

పి. హరీష్ , ఆర్‌అండ్‌బీ జేఈ

ఈసెట్‌లో ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ విద్యార్థుల ప్రతిభ

గుడ్లవల్లేరు, మే 16 (ఆంధ్రజ్యోతి) : పాలిటెక్నిక్ డిప్లమో సాంకేతిక విద్య పూర్తి చేసుకొన్న విద్యార్థులు ఇంజనీరింగ్ విద్యలో నేరుగా ద్వితీయ సంవత్సరంలో చేరేందుకు ప్రభుత్వం నిర్వహించే ఈ సెట్ (ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్)పరీక్షల్లో గుడ్లవల్లేరు ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ విద్యార్థులు మెదటి 25 లోపు ర్యాంక్‌లు 11, 100 లోపు 52 స్టేట్ ర్యాంక్‌లు సాధించారని పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ నిమ్మగడ్డ రాజశేఖర్ తెలిపారు.ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్‌లో రాష్ట్ర 6వ ర్యాంక్‌ను తమ విద్యార్థి మేక మహేష్ ఏఐఎంఎల్ విభాగ విద్యార్థి సాధించారన్నారు. ఏఐఎంఎల్ విభాగ విద్యార్థులు కె. సారథి కుమార్ 9వ ర్యాంకు సాధించారన్నారు. విజయాలు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది. ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వరరావు, కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణ రావు, సహకార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ, ఎన్.ఎస్.ఎ్ ఎ.వి.రామాంజనేయులు పాల్గొన్నారు.


మహేష్


శరత్ కుమార్

మినుముకు గిట్టుబాటు ధర కల్పించాలి

గుడివాడ, మే 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మండలంలో మినుము కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి మినుములను క్వింటా రూ.9000లకు కొనుగోలు చేయాలని కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు కోరారు. శుక్రవారం స్థానిక సుందరయ్యభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమ్మెవాయిదా పడిన యథావిధిగా గ్రామ సచివాలయాల్లో రైతు, కౌలు రైతు, వ్యవసాయ, వృత్తి సంఘాలు సమస్యలపై అర్జీలను సమర్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బుడమేరు, చంద్రయ్య, అయినంపూడి అండర్ డ్రెయిన్, గుడ్లవల్లేరు డ్రెయిన్లతో పాటు జిల్లాలోని మేజరు, మైనరు డ్రెయిన్లలో పూడికలను తీయించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు శొంఠి ఉమామహేశ్వరరావు, బొమ్మన రమేష్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు


కూచిపూడిలో..

చిత్తడిగా రహదారులు

కూచిపూడి, మే 16 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి రహదారులు చిత్తడి గామారాయి. మొవ్వ, కూచిపూడి బస్టాండ్ ప్రాంతంతోపాటు కూచిపూడి శ్రీ సిద్దేంద్ర కళాపీఠం, పెదపూడి రహదారులు అధ్వానంగా మారాయి. వర్షంతోపాటు ఈదురుగాలులు వీచటంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది.

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు లంకకు వెళ్ళే రహదారి నిలువరేవు రహదారి శుక్రవారం కురిసిన భారీ వర్షానికి చిత్తడిగా తయారయింది. లంకలకు వెళ్ళే కూలీలు, రైతులు నడిచేందుకు సైతం ఇబ్బందిగా మారింది. దీంతో ద్విచక్ర వాహనాలు వెళ్ళలేకపోయాయి.


ర్యాలీలో పాల్గొన్న ఆరోగ్య సిబ్బంది

డెంగ్యూపై అప్రమత్తత అవసరం

గుడివాడ రూరల్ : డెంగ్యూపై ప్రతి ఒక్కరూ అప్రమత్తత కలిగి ఉండాలని ఎంపీడీవో డివై.విష్ణు ప్రసాద్ పేర్కొన్నారు. డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా మోటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం వైద్య సిబ్బంది, డాక్టర్లు, ఏఎన్ఎంల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ రాకుండా ముందు జాగ్రత్త చర్యలు ఏ విధంగా తీసుకోవాలో తదితర అంశాలపై నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో ఉపసర్పంచ్ ఇమ్మడి నరసింహారావు , మోటూరు గ్రామస్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తోట్లవల్లూరు : తోట్లవల్లూరులో పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ డెంగ్యూ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ జ్వరం ప్రమాదకరమని, దీనిని నివారించేందుకు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ర్యాలీలో నినాదాలు చేశారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ జీవీవీ శ్రీనివాస్, డాక్టర్ మాధవి, పద్మ, అనిల్‌కుమార్ ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

బస్టాండ్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలి

● సీపీఎం మండల కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి

గుడివాడ, మే 16 (ఆంధ్రజ్యోతి) : కొద్దిపాటి వర్షానికే గుడివాడ బస్టాండ్ చెరువులా మారి ప్రయాణీకులకు తీవ్ర అసౌకర్యంగా తయారైందని, వెంటనే బస్టాండ్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి పరచాలని సీపీఎం మండల కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నీట మునిగిన బస్టాండ్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందమూరి హరికృష్ణ రవాణశాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఆసియాలోనే రెండో స్థానంలో నిలిచేలా గుడివాడ బస్టాండ్‌ను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన హామీ మాత్రం నేరవేరలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తక్షణమే చర్యలు తీసుకుని, బస్టాండ్‌ను అభివృద్ధిపరచాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌలురైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, సీపీఎం నాయకులు పి.రజిని, రేపాని కొండ, లంకా సురేంద్ర, ఏఐటీయూసీ నాయకులు కొమ్ముల సురేష్ పాల్గొన్నారు.


వర్షపు నీటిలో నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు

సమ్మెను వాయిదా వేయడం దారుణం


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణరావు

● తమ్మిశెట్టి లక్ష్మణరావు

గుడివాడ, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 20వ తేదీన తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను రాత్రికి రాత్రే జూలై 9వతేదీకి వాయిదా వేయడం దారుణమని శ్రామిక హక్కుల పోరాట సంఘం నాయకులు తమ్మిశెట్టి లక్ష్మణరావు విమర్శించారు. శుక్రవారం స్థానిక ఆటోనగర్‌లో కార్మికులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కోట్లాది మంది ఉద్యోగులు, కార్మికులు సమ్మెకు సిద్ధమైన దశలో అఖిలపక్ష కార్మిక నేతలు సమ్మె వాయిదా నిర్ణయం తీసుకోవడం బాధాకరమన్నారు. జాతీయ కార్మిక సంఘాలు కార్పొరేట్‌లకు అనుకూలంగా మెతక వైఖరిని అవలంబిచడం దారుణమన్నారు. జాతీయ కార్మిక సంఘాలు తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని 20వ తేదీన యథావిధిగా దేశవ్యాప్త సమ్మెను కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. ది గుడివాడ ఇండస్ట్రీయల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సంస్థాగత ఎన్నికల్లో నూతన విధానం

● ఎ.రామ్మోహనరావు

గుడ్లవల్లేరు, మే 16 (ఆంధ్రజ్యోతి) : యువ నాయకత్వాన్ని ముందంజలో ఉంచాలని టీడీపీ అధినాయకులు పార్టీ సంస్థాగత ఎన్నికల్లో నూతన విధానాన్ని రూపొందించారని మండల టీడీపీ సమన్వయకర్త ఎ.రామ్మోహనరావు (చంద్రాల చిట్టిబాబు) అన్నారు. శుక్రవారం సాయంత్రం మండల కొసరాజు వెంకట రామకృష్ణా రైస్ మిల్ ఆవరణలో నిర్వహించిన మండల టీడీపీ నాయకుల, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. శనివారం అన్నిగ్రామాల్లో గ్రామ సమావేశాలు నిర్వహించి గ్రామకమిటీల పేర్లను నిర్ణయించుకుని ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు జంగంమోహనరావు, ఎఎంసీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, నాగేశ్వరరావు, చిట్టిబొమ్మ నరసింహారావు, దేశపతి, అల్లూరి వాసు, కృష్ణ, బొర్రా ధనకోటేశ్వరరావు, వ్యామలరాజు, కొండబాబు, శివప్రసాద్, కరీమ్, ఏడుకొండలు, నాగేశ్వరరావు, కళ్యాణపు నవాబు, నాగజయరాం, ప్రసాద్, నరేంద్ర, ఎస్‌వీఎస్ ప్రసాద్, వెంకటరావు, వెంకటేశ్వరరావు, ఈడే మోహన్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎ.రామ్మోహనరావు

హుండీ లెక్కింపు 19న

గుడివాడ :స్థానిక విఘ్నేశ్వరస్వామి దేవస్థాన హుండీ ఆదాయ లెక్కింపు కార్యక్రమాన్ని ఈ నెల 19వ తేదీన దేవదాయ శాఖ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తుల సమక్షంలో నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు(వాసు) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నేటినుంచే

కూచిపూడి : పెడసనగల్లులోని లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 17వ తేదీ శనివారం నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ తెలియజేసింది. ఈ సందర్భంగా విశ్వక్సేణ పూజ, పుణ్యాహవచన, దీక్షాధారణ, యాగ శాల ప్రవేశం, అంకుకార్పణ, అగ్ని ప్రతిష్ట, ధ్వజారోహణ, స్వామి తిరుకళ్యాణోత్సవం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

గుడివాడ : రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని, కళాశాల యాజమాన్యం నుంచి విద్యార్థులకు ఫీజుల ఒత్తిడిని ఆపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.సమరం డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం చెల్లించకుండా నిలుపుదల చేసిన రూ.3,000కోట్లు ఫీజు రియంబర్స్‌మెంట్‌ను కూటమి ప్రభుత్వం విడుదల చేయాలన్నారరు.

సుఖ్‌దేవ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

గుడివాడ : భారతదేశ స్వాతంత్ర్య సమరయోధుడు సుఖ్‌దేవ్ థాపర్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని యువత దేశంలోని అసమానతలకు, కార్పొరేట్ దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాలని సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు వెంకటేశ్వరరావు కోరారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్‌లో సాహితీ స్రవంతి అధ్యక్షుడు లంకా సురేంద్ర ఆధ్వర్యంలో సుఖదేవ్ 118వ వర్ధంతి సభను నిర్వహించారు. డైట్ విశ్రాంత ప్రిన్సిపాల్ ఎం.వి.జి ఆంజనేయులు, సాహితీ స్రవంతి ఉపాధ్యక్షుడు చోడవరపు రూప , సాహిత్యాభిమానులు ఆర్‌సీపీ రెడ్డి, వై.కోటేశ్వరరావు, వి.కృష్ణకిషోర్, పి.రజని, కె.సురేష్, పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

గుడివాడ రూరల్: వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో డివై.విష్ణు ప్రసాద్ అన్నారు. మోటూరులో భారత వికాస్ పరిషత్ గుడివాడ శాఖ ఆధ్వర్యంలో సిద్ధార్థ మెడికల్ ఇనిస్ట్యూట్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ వైద్యుల సౌజన్యంతో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు పెద్దింటి రాధాకృష్ణమూర్తి, కె.రాజేష్, మాధవ్ తదితర డాక్టర్లు వందమందికిపైగా రోగులను పరీక్షించారు. భారత వికాస పరిషత్ అధ్యక్షురాలు తిరుమలశెట్టి హారిక, ఉపసర్పంచ్ ఐవి.నరసింహారావు, పాల్గొన్నారు.


రక్తహీనత నివారణే ధ్యేయం

● ఐసీడీఎస్ అధికారిణి విజయఫ్లారెన్స్

గుడివాడ, మే 16 (ఆంధ్రజ్యోతి) : బాలికలు కౌమార దశలో రక్తహీనత బారినపడకుంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ అధికారి విజయఫ్లారెన్స్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని గుడివాడ-1 సెక్టారు పరిధిలోని బాపూజీనగర్ అంగన్వాడీ కేంద్రంలో కిశోర వికాసం- వేసవి సెలవుల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రమం తప్పకుండా రెండుసార్లు ఐరన్ మాత్రలు వేసుకోవాలని, ప్రభుత్వం సరఫరా చేస్తున్న రాగిజావ, గుడ్లు, చిక్కిలతో పాటు ఆకుకూరలు, కూరగాయలను తీసుకోవాలన్నారు. సూపర్‌వైజర్ భవాని, ఏఎన్ఎమ్, అంగన్వాడీ కార్యకర్తలు కుమారి, పాల్గొన్నారు.

కూచిపూడి,: ఆవిరిపూడి అంగన్వాడీ కేంద్రంలో మొవ్వ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో కిశోర వికాస వేసవి శిక్షణా తరగతులు కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్, ఆరోగ్యశాఖ ప్రతినిధులు పుణ్యవతి, భాగ్యలక్ష్మీ, గ్లోరి, అరుణ కుమారి, శిరీష, అనిత, మోహినీ తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు :కౌమార దశలో బాలికల్లో రక్తహీనత రాకుండా ఉండాలంటే పోషకవిలువలు ఎక్కువ ఉండే ఆహారాన్ని తీసుకొంటూ ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజరు ఈ.వాణి అన్నారు. శుక్రవారం గుడ్లవల్లేరు అంగన్వాడీ కేంద్రంలో కిశోర బాలికలలకు కిశోర వికాసం-వేసవి శిక్షణా కార్యక్రమంలో భాగంగా కౌమార దశలో బాలికల్లో రక్తహీనత అనే అంశంపై ఆమె శిక్షణనిచ్చారు.


సమావేశంలో మాట్లాడుతున్న విజయఫ్లారెన్స్

పెదపారుపూడి: పెదపారుపూడి -3 అంగన్వాడీ , వెంట్రప్రగడలో పులవర్తిగూడెం అంగన్వాడీ కేంద్రంలో కిశోర వికాసం కార్యక్రమం ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అరుణ కుమారి, ఎం.శివనాగమణి అధ్యక్షతన జరిగింది. కిశోర బాలిలలో వచ్చే రక్తహీనత గురించి, దాని వల్ల కలిగే నష్టాల గురించి తెలియజేశారు. నాగలక్ష్మీ, ఏఎన్ఎం వాణి, వీవోలు అరుణ కుమారి పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 525

కాపుసేన లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షునిగా లంకిశెట్టి బాలాజీ



మచిలీపట్నం టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : కాపుసేన లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షునిగా లంకిశెట్టి బాలాజీ నియమితులయ్యారు. కాపుసేన రాష్ట్ర అధ్యక్షుడు బసవ చినబాబు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలశెట్టి కొండలరావు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ, కాపు కార్పొరేషన్‌కు, విదేశీ విద్యకు నిధులు మంజూరు చేయాలని, కార్పొరేషన్ అధ్యక్ష పదవిని భర్తీ చేయాలని, పేద కాపు విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నేతలు నడకుదుటి తదితరులు

మినీ మహానాడుకు స్థల పరిశీలన

మోపిదేవి, మే 16 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ నియోజకవర్గ మినీ మహానాడు ఈనెల 19వ తేదీన మోపిదేవిలో నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలియజేశారు. మినీ మహానాడు నిర్వహణకు 216ఏ జాతీయ రహదారి వెంబడి ఉన్న స్థలాన్ని శుక్రవారం పార్టీ నాయకులు పరిశీలించారు. మోపిదేవి నుంచి చల్లపల్లి వెళ్లే ప్రధాన జాతీయ రహదారి వెంబడి హోటల్ ఎస్.విహార్ ఎదుట ఉన్న పొలాన్ని ఎంపిక చేసినట్లు మండల పార్టీ అధ్యక్షుడు నడకుదుటి జనార్ధనరావు తెలి పారు. పార్టీ నాయకులు మెడబలిమి మల్లిఖార్జునరావు, రావి నాగేశ్వరరావు, దిడ్ల జానకి రాంబాబు, డోకిపర్తి బాలకోటేశ్వరరావు, రావి రత్నగిరి, బళ్లా సీతారామ్ ప్రసాద్, దొప్ప లపూడి జగదీష్, వేములపల్లి రవిచంద్ర, కోనేరు నాని, ఉప్పాల యేసు, కనకయ్య ఉన్నారు.

డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడమే లక్ష్యం

మచిలీపట్నం టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచి నగరంలో ముంపు సమస్యను నివారించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. లక్ష్మీటాకీసు సెంటర్‌లోని డ్రెయిన్‌లో సిల్టు తొలగింపు పనులను టీడీపీ నాయకుడు పి.వి.ఫణికుమార్, మునిసిపల్ కమిషనర్ బాపిరాజుతో కలిసి ఆయన పరిశీలించారు. డ్రెయిన్‌లో ఏడు అడుగుల లోతు సిల్టును తీయించారు. డ్రెయిన్లలో చెత్తాచెదారం వేయకుండా ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ నాయకులు కొస్తా మురళీకృష్ణ, టంకాల రమణ తదితరులు పాల్గొన్నారు.



పూడికతీతను పర్యవేక్షిస్తున్న బాపిరాజు, టీడీపీ నాయకులు



రైలుపేటలో మాట్లాడుతున్న పీడీ రాణి



నాయుడుపేటలోఅవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రాజరాజేశ్వరి



తాడేపల్లిలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ మేరి

కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి

మచిలీపట్నం టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని శిశు సంక్షేమ శాఖ పీడీ ఎం.ఎన్. రాణి అన్నారు. మచిలీపట్నం రైలుపేట అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. పీడి రాణి మాట్లాడుతూ, 15 నుంచి 18 ఏళ్ల వయసు గల కిశోర బాలికలు ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. రక్తహీనత లేకుండా ఆకు కూరలు, పండ్లు తీసుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్ మాలతీదేవి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కోడూరు : కోడూరు శివారు నాయుడుపేట అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోర వికాసం నిర్వహించారు. కిశోర బాలికలకు సోషల్ మీడియాపై అవగాహన కల్పించారు. కిశోర బాలికల హక్కులు, పౌష్టికాహారం, కౌమార దశలో రక్తహీనత బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజరాజేశ్వరి తెలిపారు. బాల్య వివాహాల వల్ల అనర్థాలను వివరించారు. ఏఎన్ఎం ఎన్.సునీత, అంగన్‌వాడీ కార్యకర్త ఆశలత, ఆశావర్కర్ నవ మణి, నాగ భవాని పాల్గొన్నారు. **ఘంటసాల** : తాడేపల్లి అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.మేరీ మాట్లాడుతూ కిశోర బాలికలు కౌమార దశలో రక్తహీనతకు గురవుతుంటారని, దీనిని అధిగమించేందుకు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాలికలకు 19 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహాలు చేయాలని సూచించారు. ఏఎన్ఎం జి.సునీత, ఆశావర్కర్ కె.రాణి, బుక్ కీపర్ సరోజిని, అంగన్వాడీ కార్యకర్తలుపాల్గొన్నారు. **నాగాయలంక** : ఆడ పిల్లలకు చిన్న వయస్సులో పెళ్లిళ్ల చేయవద్దని తల్లులకు నాగాయలంక మహిళా పోలీసు ఝాన్సీ హితవు పలికారు. నాగాయలంక -3 అంగన్వాడీ కేంద్రంలో కిశోర వికాసం కార్యక్రమంలో ఆడపిల్లలకు, తల్లులకు అవగాహన కల్పించారు. అంగన్వాడీ కార్యకర్త మద్దాల నిర్మలా జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

ఘంటసాల, మే 16 (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లి గ్రామంలో సువర్చలా సమేత ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది.

అర్చక స్వాములు రొంపిచర్ల వెంకట శేష సుధాకర్, నల్లూరి దాశరథి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ప్రతిష్ఠా పూజలు జరిపారు. లింగినేని రోహిత్ - పుషమి దంపతులు పీటల మీద కూర్చుని స్వామివారి కల్యాణం జరిపించారు. అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులు కల్యాణం తిలకించి తరించారు.

ఈ కార్యక్రమాల్లో దండమూడి శివనాగేశ్వరరావు, సూరపనేని వెంకట్రావు, మైనేని మధుసూదన్ రావు, సూరపనేని సుధాకర్‌రావు, శ్రీరామ్మూర్తి, సూరపనేని శివరామ ప్రసాద్, యార్లగడ్డ వీరభద్రరావు, మొవ్వ కోటేశ్వరరావు, గ్రామస్థులు పాల్గొన్నారు. అనంతరం గ్రామ ప్రముఖుల ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.





స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న రోహిత్ - పుషమి దంపతులు



మడక ఎస్టీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో అరుణ కుమారి

ఆధార్ నమోదుకు ఎస్టీలను గుర్తించాలి

పెడన రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఆధార్ కార్డులు లేని, పిల్లల జనన నమోదు చేయించుకోలేని ఎస్టీలను గుర్తించి వారికి ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలను అందించాలని ఎంపీడీవో అరుణ కుమారి ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఆదేశానుసారం ఈనెల 16వ తేదీ నుంచి 23వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లోని ఎస్టీ కుటుంబాలను సర్వే చేసి గుర్తించాలన్నారు. మడక, నందిగం, కూడూరు గ్రామాల్లో ఎంపీడీవో పర్యటించి ఎస్టీ కుటుంబాలను కలిశారు. ఆధార్ లేకపోవటంతో ఎస్టీలు ప్రభుత్వ పథకాలు, రేషన్ బియ్యం పొందలేకపోతున్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజు సర్వే చేసి నివేదిక అందించాలన్నారు. అనురాధ, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

నాగాయలంకలో ఈదురుగాలులతో వర్షం

నాగాయలంక, మే 16 (ఆంధ్రజ్యోతి) : నాగాయలంకలో శుక్రవారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షం కురిసింది. వర్షపాతం 11.8 మిమీగా నమోదైనట్లు అధికారులు తెలిపారు. గాలులకు ఆర్‌సీఎం చర్చి ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిలోని చెట్ల కొమ్మలు విరిగిపోయి రోడ్డు మధ్యలో పడ్డాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. వర్షానికి వాతావరణం చల్లబడి వేసవి తాపం నుంచి ప్రజలు ఉపశమనం పొందారు.




ఈదురుగాలులకు విరిగిపడిన చెట్టు

50 శాతం సబ్సిడీపై పశుదాణా పంపిణీ

కోడూరు, మే 16 (ఆంధ్రజ్యోతి) : కోడూరు పశువైద్యశాలలో 50 శాతం సబ్సిడీపై పశువుల దాణా పంపిణీ కార్యక్రమాన్ని తూర్పు కృష్ణా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. పశు సంవర్ధక శాఖ సూచన మేరకు రూ. 110 విలువ గల 50 కేజీల దాణా 50 శాతం సబ్సిడీ పోనూ రూ.55 లకు పాడి రైతులకు అందించారు. పశువైద్యాధికారి ఎండి.షఫీ మాట్లాడుతూ సబ్సిడీపై దాణా తీసుకోవటానికి పశువుల యజమానులు ముందుగా భారత్ పశుధన్ యాప్‌లో రైతు పేరు నమోదు చేసుకోవాలని, పశువులకు టీకాలు వేసి ఉండాలని, కేవలం తెల్లరేషన్ కార్డు కలిగిన పాడి రైతులకు మాత్రమే ఇవ్వటం జరుగుతుందన్నారు. రైతు సేవా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మర్రె గంగయ్య, పూతబోయని శ్రీనివాసరావు, వేములపల్లి రాజేష్, బొడ్డు వెంకన్న, వి.కొత్తపాలెం పశువైద్యాధికారి ఎం.రోహిత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.



రైతులకు దాణా అందిస్తున్న ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ దేవనబోయిన



శివరామకృష్ణ క్షేత్రానికి రూ.1,10,116 విరాళం

కోడూరు, మే 16 (ఆంధ్రజ్యోతి) : కోడూరులో పునర్నిర్మాణం చేస్తున్న శివరామకృష్ణ క్షేత్రానికి గ్రామానికి చెందిన సింగం వీరబాబు కుటుంబ సభ్యులు రూ.1,10,116 విరాళాన్ని అందించారు. వీరబాబు స్వగృహం వద్దకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు వెళ్లి విరాళాన్ని అందుకున్నారు. ఆలయ పునర్నిర్మాణానికి సహకారం అందించిన వీరబాబు కుటుంబసభ్యులను దుశ్శాలువతో కమిటీ సభ్యులు సత్కరించి అభినందించారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు అన్నం వెంకట సుబ్బారావు, బూరగడ్డ హరినాథ్‌బాబు, జూపూడి సుభాష్ చంద్రబోస్, బడే భావన్నారాయణ, అన్నం శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వంటమేస్త్రి పులిహోర నిర్వాకం

● యువతిని గర్భవతిని చేసి, పెళ్లికి నిరాకరణ ● అబార్షన్‌కు వత్తిడి

● పోలీసులను ఆశ్రయించి న్యాయం చేయాలని వినతి

మచిలీపట్నం టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : పులిహోర చేయడం నేర్పుతానంటూ మాయమాటలు చెప్పి వంట మేస్త్రి తనను గర్భవతిని చేసి, పెళ్లికి నిరాకరిస్తున్నాడంటూ యువతి శుక్రవారం పోలీసులను ఆశ్రయించింది. ఎస్పీ ఆర్. గంగాధరరావును కలిసి తనకు న్యాయం చేయాలంటూ వినతి పత్రం అందజేసింది. ఎస్పీ సూచన మేరకు మచిలీపట్నంలో పోలీస్‌స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేసిన అనంతరం వల్లు భార్గవి (27) మీడియాకు తన గోడు వినిపించింది. రాడార్ కేంద్రం సమీపంలోని అంజమ్మ కాలనీకి చెందిన వల్లు భార్గవికి తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. ఒక కుమారుడు ఉన్నాడు. మనస్పర్థల వల్ల పెద్దల సమక్షంలో భర్తతో విడిపోయి పుట్టింట్లోనే ఉంటోంది. అదే కాలనీలో ఉంటున్న వంటమేస్త్రి సుధాకర్ పులిహోర చేయడం నేర్పుతానంటూ భార్గవితో పరిచయం పెంచుకుని లోబరచుకుని గర్భవతిని చేశాడు. తన అన్నకు పెళ్లి కాకుండా తాను పెళ్లి చేసుకోలేనని చెప్పి ఒకసారి అబార్షన్ చేయించాడు. రెండోసారి గర్భం దాల్చిన భార్గవి పెళ్లి చేసుకోమని కోరగా, మళ్లీ అబార్షన్ చేయించుకోమని సుధాకర్ వత్తిడి తీసుకువచ్చాడు. అబార్షన్ చేస్తే భార్గవి ప్రాణానికే ప్రమాదమని వైద్యులు చెప్పారు. దీంతో సుధాకర్‌ను పెళ్లి చేసుకోమని వేడుకున్నా అతడు ఒప్పుకోవడం లేదు. భార్గవితో పెళ్లి చేయడం సుధాకర్ కుటుంబ సభ్యులకు సైతం ఇష్టం లేకపోవడంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. భార్గవి శుక్రవారం జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావుకు తన గోడు వినిపించుకుంది. ఆయన సూచన మేరకు మచిలీపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తనకు తగిన న్యాయం చేయాలని ఎస్సై, ఆర్‌పేట సీఐ ఏసుబాబును కూడా కలిసి విజ్ఞప్తి చేసింది. సీఐ ఏసుబాబు శుక్రవారం రాత్రి సుధాకర్‌ను పిలిపించి విచారణ జరుపుతున్నారు.




ముమ్మరంగా ఉపాధి పనులు

మచిలీపట్నం టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కానూరు, మంగినపూడి తదితర ప్రాంతాల్లో ముమ్మరంగా ఉపాధి పనులు జరుగుతున్నాయి. ఉపాధి పథకంలో చెరువు పూడికతీతపనులు చేపట్టారు. కానూరులో ఉపాధి పనులను టీడీపీ నాయకుడు గోపు సత్యనారాయణ పరిశీలించారు.



బండి రామకృష్ణకు పండ్ల వర్తక సంఘం సత్కారం

మచిలీపట్నం టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్‌గా నియమితులైన బండి రామకృష్ణను శుక్రవారం పండ్ల వర్తక సంఘం ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. పండ్ల వర్తక సంఘం అధ్యక్షుడు బాసం వాసు తదితరులు పాల్గొన్నారు.



వీధిని స్వచ్ఛందంగా మెరక చేసుకుంటున్న అర్తమూరు ప్రజలు

ఎవరో వస్తారని ఎదురు చూడక..!

బంటుమిల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి) : అర్తమూరులో రోడ్డుని ఆనుకుని ఉన్న తమ్మన వెంకటేశ్వర్లు ఇంటి పక్కన వీధి శుక్రవారం వర్షాలకు జలమయం అయ్యింది. వీధిలోని నివాస గృహాలకు చెందిన వారు స్వచ్ఛందంగా వీధిని మట్టితో పూడ్చారు. అధికారులు,ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా ఫలితం లేక పోవడంతో వీధిలోని వారే మెరక చేసుకున్నారు.

నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఆంజనేయులు

మచిలీపట్నం టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం నగర నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడుగా లోయ ఆంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రభుత్వ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘ హాలులో శుక్రవారం జరిగిన ఎన్నికల్లో నగర అధ్యక్షుడుగా లోయ ఆంజనేయులు, కార్యదర్శిగా కె. రాజు, కోశాధికారిగా కె. నీలకంఠం, ఉపాధ్యక్షులుగా వి. నాంచారయ్య, బి. రమాదేవి, సంయుక్త కార్యదర్శులుగా కె. వెంకటేశ్వరరావు, బి.ఎస్.ఎస్. తేజ ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు కె.ఎస్.వి. ప్రసాద్, సహాయ ఎన్నికల అధికారిగా రాము వ్యవహరించారు.

గర్భకోశ వ్యాధులపై విద్యార్థినులకు అవగాహన

అవనిగడ్డ, మే 16 (ఆంధ్రజ్యోతి) : గర్భకోశ వ్యాధులపై అవనిగడ్డ డిగ్రీ కళాశాల విద్యార్థినులకు శుక్రవారం అవగాహన కల్పించారు. చెరుకుపల్లికి చెందిన లక్ష్మీనారాయణ ఆసుపత్రి, కల్యాణి ఫెర్టిలిటీ సెంటర్ ఆధ్వర్యంలో గర్భాశయ సమస్యలపై అవగాహన కల్పించారు. షుగర్, బీపీ, థైరాయిడ్ పరీక్షలు నిర్వహించారు. ప్రిన్సిపల్ డి.ఉమారాణి, డాక్టర్ జ్యోతి కల్యాణి, ఇంచార్జ్ ప్రిన్సిపాల్ వీరకుమారి, అధ్యాపకులు నాగమణి, పృథ్వీజ, విద్యార్థులు పాల్గొన్నారు.

పచ్చని చెట్లను నరికితే చట్టపరమైన చర్యలు

నాగాయలంక, మే 16 (ఆంధ్రజ్యోతి) : పెద్దకమ్మవారిపాలెం గ్రామ పరిధిలోని కృష్ణా నది కరకట్టపై వేప చెట్లు, తదితర మొక్కలను, చెట్లను నరికితే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సర్పంచ్ తలశిల అర్జునరావు, కార్యదర్శి వివి.నారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కొంతమంది కరకట్ట మీద ఉన్న చెట్లను నరికి వేయటం, నిప్పు పెట్టడాన్ని గుర్తించామన్నారు. భవిష్యత్‌లో ఈ ఘటనలు పునరావృతమయితే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మండల సమావేశం 21న

పెడన రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 21వ తేదీ ఉదయం గం.10.30ని.లకు ఎంపీపీ రాజులపాటి వాణి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో అరుణకుమారి తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాల్సిందిగా కోరారు.

ఆర్‌వోబీ నిర్మాణానికి అంచనాలు



పెడన, మే 16 (ఆంధ్రజ్యోతి) : పెడనలో రైల్వే గేట్ల వద్ద ఆర్‌వోబీ నిర్మాణానికి అంచనాలు రూపొందించనున్న తహసీల్దార్ కె. అనిల్‌కుమార్, కమిషనర్ మన్నం గోపాలరావు తెలిపారు. గూడూరు రైల్వేగేటు, మచిలీపట్నం రైల్వేగేటును శుక్రవారం వారు పరిశీలించారు. రైల్వేశాఖ సీనియర్ ఇంజనీర్ శ్రీనివాసరావు, ఆర్ఐ విజయలక్ష్మి, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ పామర్తి జితేంద్ర, టౌన్ సర్వేయర్ నాగరాజు పాల్గొన్నారు. తహసీల్దార్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ, రైల్వేశాఖ ఉత్తర్వుల మేరకు గూడూరు, మచిలీపట్నం రోడ్లలోని రైల్వేగేట్లను, పరిసరాలను పరిశీలించి అంచనాలు రూపొందిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, ఎంపీ బాలశౌరి చేసిన కృషి వల్ల రైల్వేశాఖ ఆర్‌వోబీల నిర్మాణానికి ముందుకు వచ్చిందన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

బంటుమిల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): బంటుమిల్లి నటరాజ్ థియేటర్ సమీపాన శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. తుమ్మిడి గ్రామానికి చెందిన ఏకుల శివయ్య బంటుమిల్లి నుంచి వెళుతుండగా వాటర్ ట్యాంకర్ ఢీ కొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన శివయ్యను చికిత్స నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆక్విడెక్ట్ పనుల పరిశీలన

అవనిగడ్డ రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఆక్విడెక్ట్‌కు గత కొన్ని రోజులుగా జరుగుతున్న మరమ్మతు పనులను శుక్రవారం వైసీపీ నాయకులు గౌతమ్ పరిశీలించారు. నీటి సంఘం మాజీ అధ్యక్షుడు వర్రే బస్వారావు, అద్దంకి శేషు, రాజనాల తేజ, గల్లా జితేంద్ర, ఇతరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

నాగాయలంక, మే 16 (ఆంధ్రజ్యోతి): పోతురాజు స్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం గ్రామ టీడీపీ ఆధ్వర్యంలో సభ్యత్వ కార్డులను పార్టీ శ్రేణులకు శుక్రవారం పంపిణీ చేశారు. కుటుంబ సాధికారిత సభ్యులను సమావేశంలో నియమించారు. మండల టీడీపీ అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ మండవ బాలవర్ధిరావు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, ఉప్పల ప్రసాద్, చిట్టా అన్నపూర్ణయ్య, తదితరులు పాల్గొన్నారు. బావదేవరపల్లిలోనూ కార్డుల పంపిణీ జరిగింది.